
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 30.12.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 30 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com








## నోట్లు మారాయి..

### పాత నోట్లతో 2016కు వీడ్కోలు

# పాట్లు మారేనా?

### కొత్త నోట్లతో 2017కు స్వాగతం

***ఈరోజు... డిసెంబర్ 30వ తేదీ... 52రోజులుగా భారతదేశంలోని 125కోట్ల మంది ప్రజలు ఈరోజు కోసమే చూస్తున్నారు. అయితే ఇంతకాలం డిసెంబర్ 30వ తేదీని ఒక కోణంలో చూసేవాళ్లు. అది ఆ ఏడాది ముగింపు దినంగా భావించేవాళ్లు. కొత్త సంవత్సరం కోసం ఎదురుచూసే వాళ్లు.***

**ఈ** సంవత్సరం పరిస్థితి అదికాదు. పాత నోట్ల రద్దుకు అది తుదిగడువు. నవంబర్ 8వ తేదీన పాత వెయ్యి, ఐదొందల నోట్లను రద్దు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించారు. బ్యాంకుల్లో పాత నోట్లు జమచేయడానికి డిసెంబర్ 30వ తేదీని తుదిగడువుగా నిర్ణయించారు. ఆ తేదీయే ఈరోజు. ఈ 52 రోజులు దేశమంతా ప్రజలు ఎన్ని కష్టాలు పడాలో అన్ని కష్టాలు పడ్డారు. వ్యాపారాలలో, వేతనాల రూపంలో నష్టపోయారు. ఇంతకాలం కూడబెట్టిన సొమ్మును బ్యాంకుల్లో కట్టేసారు. ఇంట్లో ఖర్చుల కోసం, వ్యాపార అవసరాల కోసం బ్యాంకుల ముందు, ఏటిఎంల ముందు గంటల తరబడి నిలబడి నగదు తీసుకున్నారు.

భారతదేశ చరిత్రలోనే నోట్ల రద్దు అతిపెద్ద సంఘటన. 1977లో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ టైంలో కొన్ని వర్గాల ప్రజలు మాత్రమే ఇబ్బందిపడ్డారు. కాని ఇప్పుడు పెద్దనోట్ల రద్దుతో వాళ్లు, వీళ్లు అనే తేడా లేకుండా దేశప్రజలందరూ ఇబ్బంది పడ్డారు. పడుతున్నారు కూడా!

నోట్ల రద్దు గడుపు ముగిసాక ప్రజల కష్టాలు తీరుతాయని, దేశ ప్రజల భవిష్యత్ దివ్యంగా ఉండబోతుందని ప్రధాని నరేంద్రమోడీ ధీమాగా చెబుతూ వచ్చారు. అయితే ఆ ధీమాకు తగ్గట్లుగా పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయా? అన్నది ప్రశ్న!

పెద్దనోట్ల రద్దు తర్వాత కేంద్రం ఆశించింది దాదాపు 4లక్షల నుండి 5లక్షల కోట్ల దాకా నల్లధనం బ్యాంకులకు రాకుండా ఆగిపోతుందని, బ్యాంకులకు రాని ఆ నల్ల డబ్బు ప్రభుత్వానిదే అవుతుందని, కాబట్టి ఆ డబ్బుతో దేశ వ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్ట వచ్చని భావించారు. కాని ఆ అంచనా తప్పింది. దేశంలో 15.5లక్షల కోట్లు వెయ్యి, 500 రూపాయల నోట్లుండగా డిసెంబర్ 10వతేదీ నాటికే బ్యాంకులలో 14లక్షల కోట్లు దాకా పోగయినట్లు సమాచారం. ఇక మిగిలిన ఈ 20రోజులలో వచ్చి చేరిన పెద్దనోట్ల పై లెక్క రావాలి. ఇంకో లక్ష కోట్లు సులభంగా జమవుతాయి. ఈ లెక్కన చూస్తే బ్లాక్‌పై కేంద్రం పెట్టుకున్న ఆశలు గల్లంతైనట్లే!

నల్లధనం అంతా తెల్లధనంగా మారిపోయింది. దేశంలో పేద ప్రజల

(మిగతా 11వ పేజీలో)

## ఎమ్మెల్సీ పోరు... పోటీలో ఎవరు?



**త్వ**రలో నెల్లూరుజిల్లా స్థానిక శాసన మండలి నియోజకవర్గానికి ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పటికే పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల వేడి మొదలైంది.

(మిగతా 11వ పేజీలో)




## లీడర్స్ వార్!

- సోమిరెడ్డి వర్సెస్ గోవర్ధన్‌రెడ్డి
- తారాస్థాయికి చేరిన యుద్ధం

***రెం**డున్నరేళ్ల కాలం నుండి నెల్లూరుజిల్లా రాజకీయాలు చాలా చప్పగా ఉంటున్నాయి. జిల్లాలో ఇద్దరు ముగ్గురు మాత్రమే రాజకీయంగా కాకలు తీరిన నాయకులున్నారు. మిగిలిన వాళ్లంతా కార్పొరేట్ నాయకులే...*

జిల్లా రాజకీయాల్లో అసలైన వేడి ఇప్పుడే రాజుకుంది. సర్వేపల్లి కేంద్రంగా ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిల మధ్య ఆరోపణలు, విమర్శల యుద్ధం రాజుకుంది. ల్యాండ్ కబ్జా నుండి మొదలైన విమర్శల తూటాలు మనీ లాండరింగ్ దాకా చేరాయి. ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడంలో, ఒకరి అక్రమాలు ఒకరు బయటపెట్టుకోవడంలో ఎత్తులు, పైఎత్తులు వేసుకుంటూ సాగిపోతున్నారు. సోమిరెడ్డి, కాకాణిల మధ్య అక్రమ గ్రావెల్ తవ్వకాల నుండి రాజకీయ చిచ్చు రగులుకుంది. జడ్పీ సమావేశంలో

(మిగతా 11వ పేజీలో)



# కళలను కాపాడుకుందాం

బీద మస్తాన్‌రావు



కళలను, సంప్రదాయాలను కాపాడుకుంటేనే తెలుగుజాతి ఉనికి భావితరాలకు అందించగలమని రాష్ట్ర రాజధాని నిర్మాణ కమిటి సభ్యుడు, మాజీఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు. సంస్కృతి తరంగాలు చారిటబుల్ ట్రస్ట్ ఆంధ్ర, తెలంగాణ ఉమ్మడి రాష్ట్ర సంగీత పోటీలు ఆదివారం నెల్లూరు టౌన్‌హాల్లో జరిగాయి. బహుమతి ప్రదానోత్సవంలో పాల్గొన్న బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ కళలను కాపాడుకోవడంలో వధాన్యులు, సంస్థలు, కళాకారులు సంయుక్తంగా కలిసి పని చేయాలని, అప్పుడే కళలు సజీవం అవుతాయన్నారు. రెండు రాష్ట్రాల సంగీత పోటీలు మూడురోజుల పాటు నిర్వహించిన ట్రస్ట్ వ్యవస్థాపకులు రేణిగుంట రాజశేఖర్‌ను అభినందించారు. సంస్కృతి తరంగాలు ట్రస్ట్ ప్రతి ఏడాది నిర్వహించే పోటీలకు లక్ష రూపాయలు విరాళం ఇస్తున్నట్లు ప్రకటించారు. తల్లిదండ్రుల పేరిట బీద రమణయ్య సాహిత్య పురస్కారాన్ని ప్రతి ఏడాది అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో బీద మస్తాన్‌రావును, బుద్దాల వెంకటరామారావును, ట్రాన్స్‌కో ఎస్‌ఇ కళాధర్‌రావును, దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్‌ను శాలువ, గజమాల, పూలకిరీటంతో ఘనంగా సత్కరించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు రేణిగుంట రాజశేఖర్ మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచే కాకుండా పలు రాష్ట్రాల తెలుగువారు దాదాపు 70మంది పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. సంగీత మీద వున్న ఆసక్తే ఈ కార్యక్రమం ఏర్పాటుకు నాంది అన్నారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న విజేతలకు నగదు బహుమతులతో పాటు, జ్ఞాపికలను ముఖ్యఅతిథులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరునగర ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను బీద మస్తాన్‌రావు ఆవిష్కరించారు.






# పర్యాటక కేంద్రంగా నెల్లూరు

## ఉల్లాసంగా... ఉత్సాహంగా ప్రారంభమైన 'పక్షుల పండుగ'

జిల్లాలోని పులికాట్ సరస్సును టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి సిద్ధా రాఘవరావు తెలిపారు. మంగళవారం సూళ్ళూరుపేటలోని జూనియర్ కాలేజీ ఆవరణంలో కన్నుల పండువగా జరిగిన ఫ్లెమింగో పెస్టివల్ (పక్షుల పండుగ)లో రాష్ట్ర పర్యాటకశాఖ ఛైర్మెన్ వి.జయరామిరెడ్డితో కలసి ఆయన పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల ప్రదర్శనలకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, పులికాట్ సరస్సు ఎంతో ప్రాముఖ్యత కలిగినదని, లక్షలాది విదేశీ విహంగాలు ఇక్కడికి వచ్చి విడిదిచేస్తుంటాయన్నారు. పులికాట్‌ను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృతనిశ్చయంతో వున్నారని, ఈసారి ఈ ఫెస్టివల్ నిర్వహణకు రెండు కోట్ల రూపాయలను మంజూరు చేశారన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఛైర్మెన్ జయరామిరెడ్డి మాట్లాడుతూ వచ్చే పక్షుల పండుగ కల్లా పులికాట్, నేలపట్టులను ప్రపంచ స్థాయి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్సీలు వాకాటి నారాయణరెడ్డి, బీద రవిచంద్ర, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, జడ్పీ ఫ్లోర్ లీడర్ వేనాటి రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పరసా రత్నం, నెలవల సుబ్రహ్మణ్యం, మునిసిపల్ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి, టిడిపి నాయకులు ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి, వేనాటి పరంధామరెడ్డి, చెంగాళమ్మ ఆలయఛైర్మెన్ ముప్పాళ్ళ వెంకటేశ్వర్లురెడ్డిలతో పాటు జాయింట్ కలెక్టర్‌లు ఇంతియాజ్ అహ్మద్, రాజ్ కుమార్, జడ్పీ సిఇఓ రామిరెడ్డి, డిఎస్పీ శ్రీనివాస్, ఆర్డీఓ శీనానాయక్ పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

# 'నెల్లూరుజిల్లా జానపద కథలు' ఆవిష్కరణ





ప్రముఖ రచయిత, కోవూరు టివిఎన్‌సి డిగ్రీ కళాశాల ఆంధ్రోపన్యాసకులు డా. కెవి సత్యనారాయణ పరిశోధించి రచించిన 'నెల్లూరుజిల్లా జానపద కథలు' అనే పరిశోధక గ్రంథాన్ని ఇటీవల కావలిలోని తెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ పరిశోధక గ్రంథంలో జానపదుల కథలు, జానపదుల జీవన రీతులు వగైరా అంశాలెన్నో వున్నాయి. జిల్లాకు సంబంధించిన ఇలాంటి పరిశోధక గ్రంథాలు ఎంతో అరుదైనవి..అమూల్యమైనవి కూడా. సాహిత్యాభిమానులకే కాక, జానపద విజ్ఞానంపై ఆసక్తి కలిగిన వారందరికీ ఎంతో రుచించే గ్రంథం ఇది. ఈ గ్రంథావిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా ప్రముఖ సాహితీవేత్త కోట రాజశేఖర్ అవధాని విచ్చేసి ఈ గ్రంథ రచనలోని వైశిష్ట్యాన్ని విపులంగా వివరించారు. గ్రంథకర్త విశేషాలతో పాటు, గ్రంథంలోని ప్రాముఖ్యతను వివరిస్తూ 'పంచరత్నమాలిక'ను కూడా రచించి శుభాశీస్సులు అందజేశారు.

ఈ సభలో రచయిత డా.కెవి సత్యనారాయణతో పాటు, తెలుగు భాషోద్యమ సమితి కావలి శాఖ అధ్యక్షులు కె.రామమోహనరావు అధ్యక్షత వహించగా, అల్లూరు రామకృష్ణ కళాశాల ఆంధ్రోపన్యాసకులు డా.ఎం.వెంకటరావు, ప్రముఖ సాహితీవేత్త చీమకుర్తి వెంకటేశ్వరరావు, కావలి జానపద కళారంజని సంస్థ అధ్యక్షుడు కుందుర్తి శ్రీనివాసులుతో పాటు, పలు సాహితీ సాంస్కృతిక సంస్థలు, కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొని గ్రంథ రచయితను సత్కరించి అభినందించారు.

# భక్తుల కొంగు బంగారం... కలియుగదైవం

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ




భక్తుల పాలిట కొంగు బంగారం కలియుగదైవం వేంకటేశ్వరుడని ఆధ్యాత్మిక ప్రవచకులు, ఆర్ష విద్యాప్రవీణ బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ పేర్కొన్నారు. నెల్లూరు దర్గామిట్టలోని టిటిడి కళ్యాణ మండపంలో శివశక్తి భక్తబృందం ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షులు డాక్టర్ బి.శివ ప్రతాప్‌రెడ్డి నేతృత్వంలో ఈ నెల 23వ తేదీ నుండి ఆధ్యాత్మిక ప్రవచనాలు జరిగాయి. చివరిరోజైన ఈ నెల 27వ తేదీ మంగళవారం రాత్రి సామవేదం 'శ్రీ వేంకటేశ్వర మహత్మ్యం - లీలలు - మహిమలు' అనే అంశంపై ప్రవచనం గావించారు. తొలుత వేదపండితులు మాచవోలు రాజశేఖరశాస్త్రి, మాచవోలు రమేష్‌శర్మ వేదమంత్రోచ్చారణలతో ఆయన్ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా షణ్ముఖశర్మ ప్రవచిస్తూ ధర్మంతో కూడిన భక్తితో మాత్రమే భగవంతుని కృప లభిస్తుందని, ధర్మం లేని మొక్కుబడులు సమర్పించి స్వామిని మెప్పించలేమన్నారు. స్వామివారు కేవలం భక్తికి మాత్రమే ప్రాధాన్యతనిస్తారన్న విషయం కురువనంబి చరిత్ర తెలియజేస్తుందన్నారు. అహంకారం లేకుండా ఆరాధించే నిరాడంబర భక్తియే గొప్పదనే విషయం తొండమాన్ చక్రవర్తి అహంకారానికి గుణపాఠం చెప్పిన స్వామి వారి లీలలే నిదర్శనమన్నారు. స్వామి వారు నిజమైన భక్తులకు ఏదో ఒక రూపంలో అనుగ్రహిస్తారని అనంతాళ్వార్ కథ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. తిరుమల నంబి కథ ద్వారా శ్రీనివాసుని కారుణ్యాన్ని కళ్ళకు కట్టినట్లు తెలుసుకోవచ్చున్నారు. అన్నమయ్య కీర్తనలతో తిరుమల వేంకటేశ్వర వైభవం భక్తులకు సమగ్రంగా సాక్ష్యాత్కారమవుతుందన్నారు. శ్రీ కృష్ణదేవ రాయులు సైతం విష్ణుమూర్తిని సాక్షాత్కరింపజేసుకుని శ్రీ వేంకటేశ్వరుని అంకితంగా ప్రబంధ రచన చేసి స్వామివారిని తనివితీరా స్తుతించారన్నారు. ఐదురోజుల పాటు ఉపన్యాసాలు అందించిన షణ్ముఖశర్మను నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. అనంతరం శివశక్తి భక్త బృందం తరపున డా॥ బి.శివప్రతాప్‌రెడ్డి నేతృత్వంలో షణ్ముఖశర్మ దంపతులను ఘనంగా సత్కరించారు. ప్రవచన కార్యక్రమాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు అన్నమయ్య కీర్తనలు ఆలపించిన చిన్నారులకు జ్ఞాపికలను అందజేశారు.



మా ఖాతాదారులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు, గూడూరు ప్రాంత ప్రజానీకానికి
2017 నూతన సంవత్సర
మరియు
సంక్రాంతి శుభాకాంక్షలు.
వల్లంకొండ వెంకటసుబ్బయ్య
అధ్యక్షులు, చిల్లీస్ కమీషన్ మర్చెంట్స్ అసోసియేషన్
గూడూరు.

LIC
నెల్లూరు డివిజన్ ఎల్ఐసి అధికారులకు, గూడూరు బ్రాంచి మేనేజర్ మరియు స్టాఫ్‌కు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లకు, ఏజంటుమిత్రులకు, పాలసీదారులకు, పట్టణశ్రేయోభిలాషులకు మరియు లయన్ మిత్రులకు
2017 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.
మీ అందరి జీవితాలలో సంక్రాంతి వెలుగులు నింపాలని కోరుతూ...
మీ...
Ln. మల్లెమాల మురళీరెడ్డి
Ex-Disctrict Chairman(Insurance)
LIC Development Officer, Gudur Branch.



మా ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు,
గూడూరు ప్రాంత ప్రజానీకానికి
2017 నూతన సంవత్సర మరియు
సంక్రాంతి శుభాకాంక్షలు
అట్ల శీనయ్య యాదవ్, ప్రొప్రైటర్
శ్రీ లక్ష్మీ శ్రీనివాస పాన్‌బ్రోకర్స్ & దిలీప్ హైర్స్
1/573-1, మాళవ్యనగర్, గూడూరు, నెల్లూరుజిల్లా.


మిత్రులకు, శ్రేయోభిలాషులకు, గూడూరు పట్టణ ప్రజలకు

2017 నూతన సంవత్సర
మరియు
సంక్రాంతి శుభాకాంక్షలు
SEGU RAMESH
Ex-President,
Gudur Pawnbrokers Association
Gudur, Nellore Dist.,

# రెక్కలు తొడుగుతున్న అభివృద్ధి కలలు

- నెల్లూరులో ఎఫ్ఎం రేడియో స్టేషన్
- కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు వెల్లడి



అత్యంత త్వరలోనే నెల్లూరులో ఎఫ్ఎం రేడియో స్టేషన్ ఏర్పాటు జరగనుంది. నగరవాసుల స్వప్నం త్వరలోనే సాకారం కానుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ దాదాపు పూర్తయ్యాయని కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు తెలిపారు. కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్‌తో కలసి మంగళవారం ఆయన వెంకటాచలం మండలంలోని చౌటపాళెం వద్ద జాతీయ విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ (ఎన్‌సిఇఆర్‌టి) ప్రాంతీయ కార్యాలయానికి భూమి పూజ చేశారు. ఈ సంస్థను సుమారు 500 కోట్ల వ్యయంతో, 51 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుచేయబోతున్నారు.

ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, గతంలో వాజ్‌పేయి హయాంలో తాను కేంద్రమంత్రిగా వున్నప్పుడు నెల్లూరులో ఎఫ్ఎం రేడియోస్టేషన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామని, అయితే ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం దాని గురించి పట్టించుకోలేదని అంటూ, ఇప్పుడు ఆ రేడియో స్టేషన్ ఏర్పాటుకు కృషి జరుగుతోందన్నారు. తాను ఎంత ఎత్తుకు ఎదిగినా జన్మభూమిని మరచిపోనన్నారు. తాను పుట్టిన ఊరులో ఎన్‌సిఇఆర్‌టిని ఏర్పాటుచేయడం ఎంతో సంతోషంగా వుందన్నారు. ఈ సందర్భంగా కృష్ణపట్నం -ఓబులాపురం రైల్వే పనులను వారు హెలికాప్టర్ నుంచి ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. 2002లో ఈ రైల్వేలైన్‌ను తాను మంజూరు చేయించానని, 1646 కోట్లతో జరుగుతున్న ఈ పనులు వచ్చే ఏడాది జులై లోగా పూర్తిచేసేందుకు కృషి జరుగుతోందని అన్నారు. ఈ రైల్వే మార్గంలో ప్రయాణించడం, బకింగ్‌హామ్ కెనాల్‌లో పడవలో తిరగడం, నెల్లూరు నగరానికి తాగునీటి కొరత లేకుండా, మురుగునీటి సమస్యలు లేకుండా చేయాలని, ఈ కలలన్నీ సాకారం కావాలని కృషి చేస్తున్నానని అన్నారు. కేంద్రమంత్రి ప్రకాష్ జవదేకర్ మాట్లాడుతూ, ఎన్‌సిఇఆర్‌టి నెల్లూరులో ఏర్పాటుకాబోతోందని, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేస్తున్నామని, ఈ కృషి అంతా వెంకయ్యనాయుడిదేనని అన్నారు. వెంకయ్య తనకు మార్గదర్శకుడన్నారు. రాష్ట్ర మానవవనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, మంత్రి నారాయణ, ఎంపి రాజమోహన్‌రెడ్డి, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్ కుమార్, ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ రిషికేష్ సేనాపతి, జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, స్వర్ణభారత్ ట్రస్ట్ ఎం.డి దీపావెంకట్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి స్కేటింగ్‌లో
# 'విశ్వసాయి' విద్యార్థినికి రజతం




ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఇటీవల రాష్ట్ర స్థాయిలో విశాఖపట్టణంలో నిర్వహించిన స్కేటింగ్ పోటీల్లో నెల్లూరులోని 'విశ్వసాయి' విద్యాసంస్థలకు చెందిన విద్యార్థిని కుమారి కె. లక్ష్మీకౌశల్య రజత పతకాన్ని సాధించింది. 2000 మీటర్ల రోడ్డు ఈవెంట్‌లో ఆ విద్యార్థిని రజత పతకం సాధించి అందరి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా, నెల్లూరు మాగుంట లే-అవుట్‌లో వున్న విశ్వసాయి కళాశాల ప్రాంగణంలో అభినందన సభ ఏర్పాటుచేసి ఆ విద్యార్థినిని అభినందించారు. ఈ అభినందన సభలో విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మెన్ డా. ఎన్.సత్యనారాయణ, ఛైర్‌పర్సన్ శ్రీమతి రుక్మిణి, వైస్‌ఛైర్మెన్ జి.కృష్ణమోహన్, అధ్యాపకులు పాల్గొని లక్ష్మీకౌశల్యను అభినందించారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచే విధంగా ప్రోత్సహిస్తున్నామని విద్యాసంస్థల నిర్వాహకులు పేర్కొన్నారు.

# 'పక్షితీర్థం' దీర్ఘకవిత ఆవిష్కరణ



నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి ఈతకోట సుబ్బారావు రచించిన 'పక్షితీర్థం' దీర్ఘకవితను జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ ఆవిష్కరించారు. ఫ్లెమింగ్ ఫెస్టివల్ సందర్భంగా సూళ్ళూరుపేటలో ఈ నెల 24వ తేది జరిగిన బహుభాషా కవితోత్సవంలో ఈ దీర్ఘకవితావిష్కరణ జరిగింది. తొలిప్రతిని విఎస్‌యు ఉపకులపతి వీరయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కవి ఈతకోట సుబ్బారావుతో పాటు, సూళ్ళూరుపేటలోని గోకులకృష్ణ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సుబ్బరామిరెడ్డి, ప్రముఖ కవి పెరుగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# 'ప్రభా'తం

"స్వల్ప రాజకీయ అవసరాల కోసం మా నిర్ణయాలు వుండవు. దేశానికి మేలు చేసేది ఎంత కఠినమైన నిర్ణయమైనా వెనుకడుగు వేసేది లేదు. విశాలమైన దేశ అవసరాలను దృష్టిలో పెట్టుకుని భారత్‌కు ఉజ్వలమైన భవిష్యత్తును అందించేందుకు బలమైన..దూరదృష్టితో కూడిన ఆర్థిక విధానాలను తీసుకువస్తాం. దేశాభివృద్ధి కోసం మరిన్ని కఠినమైన ఆర్థిక సంస్కరణలు తీసుకువస్తాం"

**- ప్రధాని మోడీ!**

## 'బినామీ' గుండెల్లో సునామీ

**అవినీతి, నల్లధనంపై ప్రధాని మోడీ చేస్తున్న యుద్ధంలో భాగంగా, అక్రమార్కుల ఆటకట్టించేందుకు మరిన్ని చట్టాలు పటిష్టంగా రూపొంద బోతున్నాయి. పెద్దనోట్ల రద్దు తర్వాత బినామీ ఆస్తుల భరతం పట్టేందుకు మోడీ సారధ్యంలోని కేంద్రప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. అవినీతి పరులు, అక్రమార్కులకు చెంపపెట్టుగా త్వరలోనే బినామీ ఆస్తుల చట్టం రాబోతోండడం స్వాగతించదగ్గది. త్వరలోనే జిఎస్‌టి (వస్తుసేవల) బిల్లు కూడా సిద్ధమవుతోంది. ప్రజలకు, దేశానికీ ఇవన్నీ శుభ పరిణామాలే.**

నోట్ల రద్దు పథకం అమలులో సూచించిన ప్రకారం ఈ నెల 30తో డెడ్‌లైన్ ముగియడంతో..ఈ కొత్త సంవత్సరం అక్రమార్కులకు పూర్తిగా కలసిరాని కాలంగానే తయారైంది. ఇంతకాలం అవినీతితో, అక్రమాలతో విర్రవీగుతున్న నల్లధన రాకాసికి అసలు చేటుకాలం సరిగ్గా ఈ ఏడాది ప్రారంభం నుంచే ఆరంభమవుతుంది. అవినీతి, అక్రమాలను, నల్లధన రాశులను నిలువెల్లా పాతర వేసేందుకు ప్రధాని మోడీ సారధ్యంలోని కేంద్రప్రభుత్వం పూర్తిస్థాయిలో రంగం సిద్ధం చేసింది.ఇందులో భాగంగానే బినామీల భరతం పట్టేందుకు ఉద్యుక్తమవుతోంది. ప్రజలు కూడా మోడీ విధానాలను అభినందిస్తూనే వున్నారు. అందుకే ఇటీవల ఓ సభలో మోడీ మాట్లాడుతూ, 'అవినీతి పరులారా! నూటపాతిక కోట్ల మంది దేశప్రజల ఆలోచనను తక్కువ అంచనా వేయొద్దు. డిసెంబర్ 30 తర్వాత మీరు భయం భయంగా గడపాల్సిందే'..నంటూ అక్రమార్కులనుద్దేశించి చేసిన హెచ్చరిక అక్రమార్కులను నిలువెల్లా వణికిస్తోంది. ఒకవైపు పెద్దనోట్ల రద్దుతో నల్లధన రాకాసి కోరలు పీకి నట్లయింది. పెద్దనోట్ల రద్దు ఇంకా అనేక అవినీతి వ్యవహారాలను బట్టబయలు చేసింది. మరెంతోమంది నల్లధనరాకాసులను పట్టించింది. అయినప్పటికీ ఇంకా ఎంతోమంది అవినీతిపరులు, అక్రమార్కులు చట్టానికి దొరక్కుండా వుండేందుకు ఇంకా కలుగులు వెదుక్కుంటున్నారు. అయితే, ఆ ప్రయత్నాలేమీ ఇక ఫలించవని వారికి తెలిసొచ్చే కాలం దగ్గరికొచ్చింది. ఇంతకాలం ఏడ్చేవాడు ఏడుస్తుంటే దోచుకునేవాడు దోచుకుంటూనే వుంటాడన్నట్లుగా వున్న పరిస్థితి పూర్తిగా మారిపోతోంది. ఏడ్చేవాడు నవ్వేరోజులు, ఇంతకాలం ప్రజాధనాన్ని అప్పనంగా దోచుకునేవాడికి ఏడ్పురోజుల రానే వస్తున్నాయి. నల్లధనంపై చేస్తున్న పోరాటం ఆపే ప్రసక్తే లేదని, ఈ ధర్మయుద్ధంలో విజయం సాధించేవరకు పోరాటం ఆగదని, ఇది అంతం కాదు.. అరంభమేనని, ఇంకా చేయాల్సింది చాలా వుందని ప్రధాని పదేపదే స్పష్టం చేస్తూనే వున్నారు. అక్రమార్కులు, అవినీతిపరుల భరతం పట్టేందుకు త్వరలోనే బినామీ ఆస్తులపై దృష్టి సారిస్తామంటున్నారు.. ఇలా ప్రధాని మోడీ ఒక్కొక్క మాటా ఎంతో ఉద్వేగంతో చెప్తుంటే, ఆ మాటలే ఈటెలుగా మారి అక్రమార్కుల గుండెల్లో వణుకు పుట్టిస్తున్నాయి. నల్లధనంతో, బినామీ లావాదేవీలతో విచ్చలవిడిగా, భారీస్థాయిలో ఆస్తులను కూడబెట్టుకున్నవారు ఇప్పుడా అక్రమ ఆస్తులను ఎలా రక్షించుకోవాలో తెలియక రాత్రీపగలు నిద్రపట్టక అల్లాడుతున్నారు. నల్లధనం, నకిలీ కరెన్సీ, అవినీతి, ఉగ్రవాదం దేశానికి ముప్పుగా పరిణమిస్తున్న నేటి తరుణంలో ప్రధాని మోడీ అవినీతిపై సమర శంఖారావం మోగించడం, నిజాయితీపరులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తున్న ఈ మహాయజ్ఞానికి దేశవ్యాప్తంగా ప్రజలు మద్దతు ఇస్తుండడం అందరికీ తెలిసిందే. భవిష్యత్తులో దేశానికి దీనివల్ల ఎంతో మేలు జరుగుతుందని ప్రజలు మనసారా భావిస్తున్నారు. ఇంతటి మహత్తర కార్యక్రమం చేపట్టడం ఎంతో చిత్తశుద్ధి కలిగిన ఒక్క మోదీ వల్లనే సాధ్యమైంది తప్ప, ఇక ఏ నాయకుల వల్లా కాదనే అభిప్రాయాలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అయితే, రాజకీయాల్లో ఏ కొంతమంది ఈ నిర్ణయాలను వ్యతిరేకించినా, ప్రజల ఆశీస్సులు మాత్రం మోదీకే వున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎప్పుడో సుమారు 28 ఏళ్ళ క్రితం రాజీవ్‌గాంధీ హయాంలో అవినీతి నిరోధక చట్టం, బినామీ ఆస్తుల చట్టం వచ్చాయి. చట్టాలైతే వచ్చాయి కానీ ఆ తర్వాత పట్టించుకునే నాధుడే కరువయ్యారు. అయితే, బినామీ ఆస్తులను రద్దు చేయడం, బినామీ లావాదేవీలకు పాల్పడుతున్నవారిపై విచారణ జరిపించి కఠినశిక్షలు విధించడం ధ్యేయంగా ఇప్పుడు బినామీ వ్యవహారాలపై కొరడా ఝుళిపించ నున్నారు. అవినీతికి అక్రమాలకు పాల్పడి కోట్లాది రూపాయలను బొక్కసంలో దాచుకున్న నల్లధన రాకాసులు, పెద్దనోట్ల రద్దుతో కుదేలైపోయి.. ఆ దాచుకున్న నల్లధనంతో ఎంతో తెలివిగా భూములు, భవనాలు కొనుగోలుచేసుకున్న అక్రమార్కులకు చెంపపెట్టుగా ఈ కొత్త చట్టం త్వరలోనే వ్యవస్థీకృతం కాబోతుండడం ఒక శుభపరిణామం. వేలాది రూపాయలు జీతం తీసుకుంటూనే లక్షల్లో అవినీతికి పాల్పడి భూరి భవనాలను కట్టుకొన్న లంచావతారాలు, భారీగా ధనం రూపేణా, అక్రమాస్తుల రూపేణా కోట్లు కూడబెట్టుకున్న నల్లధనరాకాసుల బాగోతాలన్నీ పెద్దనోట్ల రద్దుతో బయటపడుతూనే వున్నాయి. ఈ నేపథ్యంలో, ముఖ్యంగా స్థిరాస్తి రంగంలో లక్షలాది కోట్ల రూపాయలు చేతులుమారుతూనే వుంటుంది. బినామీ లావాదేవీలకు ఈ రంగం పుట్టిల్లు లాంటిది. ఈ విషయాన్ని గుర్తించిన కేంద్రం దానిలో సక్రమమెంత అక్రమమెంత అని ఆరాతీస్తోంది. బినామీపై ఉక్కుపాదం మోపబోతోంది.ఆ చట్టాన్ని మరింత పటిష్టం చేసి, సమగ్ర కార్యాచరణతో ముందుకు రాబోతోంది. అదేవిధంగా జిఎస్‌టి బిల్లు (వస్తుసేవల బిల్లు) కూడా త్వరలోనే రాబోతోంది. ఇలాంటి చట్టాలన్నీ దేశభవితకు ఎంతైనా మేలు చేకూర్చేవేననడంలో ఎలాంటి సందేహం లేదు.

కఠినమైన ఆర్థిక సంస్కరణలే భారత్ బంగరుభవితకు దారులువేస్తాయని, ఆ దిశలో దేశాన్ని నడిపించడమే తన కర్తవ్యమని ప్రధాని మోడీ మాటలు ఆయన చిత్తశుద్ధికి ప్రతీకలనడంలో అతిశయోక్తి లేదు. ఇలాంటి మంచి నిర్ణయాలు ప్రజలకు, దేశానికి ఎంతో మేలుచేసేవేనని వేరే చెప్పనక్కరలేదు.

## భగవద్గీత కంఠస్థ పోటీలు

విహెచ్‌పి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నెల్లూరు మూలాపేటలోని హిమాలయ పబ్లిక్ స్కూల్లో ఆదివారం రాష్ట్ర స్థాయి భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు జరిగాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు పాల్గొన్నారు. ఎల్‌కెజి నుంచి మూడవ తరగతి, నాలుగు నుంచి ఏడవ తరగతి, 8 నుంచి 10వ తరగతి, కళాశాల స్థాయి, వయోజన విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ప్రతి విభాగంలో అయిదు మంది చొప్పున విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం నెల్లూరు నగరంలోని ప్రధాన వీధుల్లో భగవద్గీత పఠనం చేస్తూ నగరోత్సవాన్ని నిర్వహించారు. నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, రాష్ట్ర సత్సంగ్ ప్రముఖ్ రాముడు, విహెచ్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిడతల రమేష్, విహెచ్‌పి రాష్ట్ర కార్యదర్శి మెంటా రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## మురళీమోహన్‌రాజుకు సేవా పురస్కారం

సాహిత్య రంగంలో చేసిన సేవలకుగాను పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు విశిష్ట సేవాపురస్కారం అందుకున్నాడు. ఆదివారం కడప జిల్లా ప్రొద్దుటూరులోని కోదండరామస్వామి కళ్యాణ మండపంలో స్నేహ సేవాసమితి వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ టీవీ యాంకర్ ఆర్.వి.ప్రసాద్ చేతుల మీదుగా సేవా పురస్కారాన్ని ఆయన అందుకున్నాడు. కడపజిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఇడి శ్రీలక్ష్మి, ప్రొద్దుటూరు రైల్వేస్టేషన్ మేనేజర్ సీతారామయ్య, స్నేహ సేవాసమితి అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో క్రిస్మస్

- చర్చీలన్నీ కళకళ
- వైభవంగా సప్రం ఉత్సవం



నెల్లూరుజిల్లాలోని క్రైస్తవులు ఆదివారం క్రిస్మస్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రీస్తు జననాన్ని కీర్తిస్తూ శనివారం అర్ధరాత్రి పరిశుద్ధ హృదయంతో ప్రార్థనలు చేశారు. ఆదివారం ఉదయం అన్ని చర్చీలలో క్రైస్తవ కుటుంబాలు భక్తిశ్రద్ధలతో కరుణామయుడికి ప్రార్థనలు చేశారు. నెల్లూరునగరంలోని బిషప్ రోమన్‌క్యాథలిక్ చర్చి, డౌనీహాల్, లోన్‌స్టార్ చర్చి, పునీత అంతోని చర్చి, పెంతెకొస్తు చర్చి తదితర 500లకు పైగా చర్చిల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. క్రీస్తు జననాన్ని తెలియజేస్తూ కపాడిపాలెం, సంతపేట, బట్వాడిపాలెం తదితర సెంటరల్లలో ప్రత్యేక అలంకారాలతో పశువుల పాకల్ని ఏర్పాటు చేశారు.

### వైభవంగా సప్రం ఉత్సవం

క్రైస్తవుల ఆరాధ్య దైవం బాలఏసుకు బిషప్‌హౌస్ ఆధ్వర్యంలో సప్రం ఉత్సవం వైభవంగా జరిగింది. ఈ సప్రాన్ని బిషప్ ఎండి ప్రకాశం సువార్తతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అబ్దుల్ అజీజ్, నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. నగరోత్సవం సందర్భంగా బిషప్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక బాణాసంచా, భక్తి సంగీత కచేరీలు భక్తుల్ని ఆకట్టుకున్నాయి. సప్రం ఉత్సవం చర్చి నుండి సంతపేట సెంటర్, కపాడిపాలెం, సుబేదారుపేట మీదుగా సాగింది. కులమతాలకు అతీతంగా భక్తులు సప్రం ఉత్సవంలో పాల్గొని బాలఏసుకు పూలమాలలు, క్యాండిల్స్ అందజేశారు.

## సమస్యల సంవత్సరం

2016 సంవత్సరం... చాలా భారంగా గడిచిపోయింది. దేశంలో అన్నీ అరిష్టాలే! ఆర్థిక వ్యవస్థ కుంటుపడింది. పెద్దనోట్ల రద్దు మూలంగా ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. వ్యాపారులు స్థిమితంగా లేరు. ఇక ఉగ్రదాడులు ఈ సంవత్సరం ఎక్కువగానే జరిగాయి. ప్రధాని నరేంద్రమోడీ చేతుల్లో స్వర్గం చూపించారుగాని, ఆచరణలో నరకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అయితే ఇంకా ఘోరం. ఈ ఏడాదిలో చెప్పుకోదగ్గ అభివృద్ధి పని ఒక్కటీ లేదు. అమరావతి రాజధాని అంటూ ఆర్భాటం తప్ప అడుగు ముందుకు పడలేదు. అభివృద్ధికి కాకుండా అవినీతికి రాష్ట్రాన్ని కేరాఫ్ అడ్రస్‌గా మార్చారు. చంద్రబాబు గాలి మేడలు కడుతున్నాడు తప్పితే నిర్మాణాత్మకమైన అభివృద్ధి గురించి ఆలోచించట్లేదు.

కొంకల వీరారెడ్డి, నెల్లూరు.

## ప్రధాని స్థాయి మరిచాడు

ప్రధానిగా తనకంటే మన్మోహన్‌సింగ్ ఎంతో నయమని మోడీ నిరూపిస్తున్నాడు. ఇటీవల ఆయన చేస్తున్న ప్రకటనలు ప్రధాని స్థాయిలో ఉండట్లేదు. మోడీ ముడుపులు తీసుకున్నాడని రాహుల్ ఆరోపణలు చేసాడు. వాటిని హుందాగా తిప్పికొట్టాలేగాని, రాహుల్‌పై వ్యంగ్య వ్యాఖ్యానాలు చేయడం ద్వారా మోడీ ప్రధాని స్థాయిని దిగజార్చారు. ఇక నల్లకుబేరుల అంతు చూస్తానంటూ ప్రధానిగా వుండి మోడీ బెదిరింపులకు పాల్పడడం విచారకరం. ప్రధానిగా వుంటూ అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని పోవాలే గాని ఇలా వేరు చేసి మాట్లాడుతుండడం శోచనీయం.

పి.రాజేష్, తాడిపర్తి.

## విశ్వాసం లేని నేతలు




రాజకీయనాయకుల్లో ఒక్క శాతం కూడా విశ్వాసం అన్నది లేకుండాపోతోంది. వీరికంటే మూగజీవాలే నయం. ఒక ముద్ద అన్నం పెడితే మనిషి కోసం ప్రాణమైనా వదులుతాయి. పామర్రు ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన తెలుగుదేశం నుండి రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయింది. జగన్ పుణ్యాన మూడోసారి వైసిపి తరపున ఎమ్మెల్యే అయ్యింది. తనను ఎమ్మెల్యేను చేసిన పార్టీకి ఈరోజు వెన్నుపోటు పొడిచింది. ఇలాంటి విశ్వాసఘాతుకులకు రాజకీయాల్లో స్థానం లేకుండా చేయాలి.

– షేక్ బాషా, నెల్లూరు.







## జిల్లా 'దేశం'పై ...

# బాబు అసహనం!

***రాజకీయ నాయకులు కొందరు చిలక జోస్యాన్ని నమ్ముతారు. ఇంకొందరు సోదెను నమ్ముతారు, మరికొందరు సిద్ధాంతులను నమ్ముతుంటారు. చంద్రబాబు మాత్రం తాను చేయించుకునే సర్వేలను నమ్ముతుంటాడు. చంద్రబాబు పరిపాలనలో ఈ సర్వేలు ఒక భాగంగా ఉంటాయి. ప్రభుత్వ పనితీరుపై ఒక సర్వే... పార్టీ పనితీరుపై ఒక సర్వే... ఇక ఎమ్మెల్యేల పనితీరుపై ఓ సర్వే... మంత్రుల సమర్థతపై ఓ సర్వే... ర్యాంకుల కేటాయింపు... తన పరిపాలనలో సగం టైం వీటికే కేటాయిస్తుంటాడాయన! ఇటీవల నిర్వహించిన సర్వేలలో నెల్లూరుజిల్లాలో తెలుగుదేశం పార్టీ బలహీనంగా వుందని, ఇంకా బలం పుంజుకోలేదనే విషయం బయటపడింది.***

మొదటి నుండి కూడా ఈ జిల్లాలో తెలుగుదేశం బలహీనమే! కాకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం మీద వ్యతిరేకత వచ్చినప్పుడు తెలుగుదేశం క్లీన్‌స్వీప్ చేస్తుండేది. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం బలహీనంగానే వుండింది. ఆ ఎన్నికల్లో ఆ పార్టీకి 3 అసెంబ్లీ సీట్లు దక్కాయన్నా అది వైకాపా వైఫల్యం వల్లేగాని, తెలుగుదేశం గట్టిగా ఉండి కాదు. ఎన్నికల నాటికి ఇప్పటికీ పరిస్థితుల్లో పెద్ద తేడా లేదు. పార్టీ అధికారంలో వుంది కాబట్టి, కొంచెం పసుపు కళ కనిపిస్తోంది. ఎన్నికల సమయానికి ఆ కళ కూడా ఉండక పోవచ్చు. జిల్లాలో ఒక్క ఆత్మకూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో తప్పితే ఏ నియోజకవర్గంలోనూ తెలుగుదేశం శ్రేణులు ఉత్సాహంగా లేవు. ఈమధ్య జనచైతన్యయాత్రలు నిర్వహించారంటే, కేవలం అధికారపార్టీ కావడం వల్లే పూర్తి చేయగలిగారు. అది కూడా భారాన్నంతా కాంట్రాక్ట్ పనులు చేస్తున్న వాళ్లు మోసారు కాబట్టి!

జిల్లాలో తెలుగుదేశం పుంజుకోవడానికి అవకాశాలు లేవు. ఈ జిల్లాలో పార్టీకి మంత్రి పి.నారాయణ పెద్ద మైనస్. మంత్రిగా వున్నా, ఆయన పార్టీ పటిష్టతకు చేసిందేమీ లేదు. మంత్రి అన్నవాడు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నాయకులకు ఊతంగా నిలవాలి. నాయకులు అడిగిన పనులు చకచక చేస్తూ పార్టీకి, ప్రభుత్వానికి ప్రజల్లో సానుకూలత పెంచాలి. ఆ విషయంలో నారాయణ విఫలమయ్యాడు. ఇక తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక జిల్లాలో చెప్పుకోదగ్గ అభివృద్ధి పనంటూ ఒక్కటీ జరగలేదు. ఎవరి బ్రతుకులు బాగుపడింది లేదు. కొత్తగా పరిశ్రమలు రావడం, ఉద్యోగాలు పెరగడం వంటివి జరగలేదు. కొత్తగా సాగునీటి ప్రాజెక్టులు లేవు. ప్రజా సంక్షేమ పథకాలతో దూసూకుపోయిందీ లేదు. అదీగాక పార్టీలో ఇటీవల కుల ఆధిపత్య పోకడలు ఎక్కువుగా కనిపిస్తున్నాయి. ఈ జిల్లాలో అలాంటి రాజకీయాలను ప్రజలు సహించరు. కాబట్టి ఈ జిల్లాలో తెలుగుదేశం బలపడడం చాలాకష్టంతో కూడుకున్న పని! చంద్రబాబు వీటిని సరిదిద్దుకోకుండా పార్టీ బలపడడం లేదని అసంతృప్తి చెందితే ఏం లాభం?



# నెల్లూరు కోసం...

***దాదాపు 20ఏళ్ల పాటు నెల్లూరు నగరాన్ని ఆనం వివేకానందరెడ్డి ఏకచక్రాధిపత్యంగా ఏలారు. 1995లో నెల్లూరు మున్సిపల్ ఛైర్మెన్‌గా గెలిచింది మొదలుకొని 2014 ఎన్నికల దాకా కూడా నెల్లూరులో వివేకా హవానే నడిచింది. 1995 నుండి 2004 దాకా రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలో వున్నా నెల్లూరులో మాత్రం వివేకా రాజ్యమే నడిచింది.***

2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2014వరకు కూడా ఆయన హవాకు అడ్డు లేకుండా పోయింది. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆనం రామనారాయణరెడ్డి మంత్రిగా వుండడం, నెల్లూరు కార్పొరేషన్ వివేకా గుప్పిట్లోనే ఉండడం మూలంగా ఆయన ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లుగా సాగింది. ఇప్పటిలాగా నెల్లూరు నగరంపై పదిమంది పెత్తనం లేదు. 20ఏళ్ల పాటు నెల్లూరు నగరంపై వివేకా ఒక్కడి పెత్తనమే సాగింది.

రాష్ట్ర విభజన మూలంగా రాష్ట్రంలో కాంగ్రెస్ నామ రూపాలు లేకుండా పోవడం, 2014 ఎన్నికల్లో వివేకా అసలు ఎన్నికల్లో పోటీ చేయకపోవడం, పోటీ చేసిన ఆనం కుటుంబ సభ్యులకు డిపాజిట్లు కూడా రాకపోవడం వంటివి వారి రాజకీయ జీవితంలో పెద్ద కుదుపుగా చెప్పుకోవచ్చు. కాంగ్రెస్‌లో వుంటే తమ రాజకీయ బతుకులు ఇలాగే వుంటాయని భావించిన ఆనం వివేకా, రామనారాయణరెడ్డిలు తెలుగుదేశంలో చేరడం తెలిసిందే!

నెల్లూరు నగరంలో తిరిగి తమ వర్గ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునే ప్రయత్నాలకు ఆనం శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తెలుగుదేశంపార్టీకి నగర ఇన్‌ఛార్జ్‌గా ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి ఉండగా, పార్టీ నగర అధ్యక్షులుగా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి వున్నారు. వారిని పక్కనపెట్టి నగర నియోజక వర్గ బాధ్యతలు తమకు అప్పగించాలని వారు చంద్రబాబును కోరుతున్నట్లు తెలుస్తోంది. మంత్రి నారాయణ ద్వారా ఈ ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటికే ఆత్మకూరు బాధ్యతలను ఆనం రామనారాయణ రెడ్డికి అప్పగించారు. ఆనం సోదరులను పార్టీలో చేర్చుకునేటప్పుడే ఆత్మకూరు ఇన్‌ఛార్జ్ ఇస్తామని, నెల్లూరు అడగొద్దని చంద్రబాబు చెప్పాడు. అయితే చంద్రబాబు మాటలకు అంత గ్యారంటీ ఏమీ ఉండదు. రేపు అవసరమనుకుంటే ఆనం వివేకా సూచన ప్రకారం ఆయన వారసులకు నగర ఇన్‌ఛార్జ్ బాధ్యతలు ఇచ్చినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదు. మంత్రి పి.నారాయణ తలచుకుంటే ఇది పెద్ద పని కూడా కాదు!


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


# నారాయణ ఓట్లపైనే నమ్మకం!



తూర్పు రాయలసీమ(ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు) పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల ప్రచారంలో తెలుగుదేశంపార్టీ వేగంగానే ముందుకుపోతోంది. ఈ నియోజకవర్గం నుండి తెలుగుదేశం ఎమ్మెల్సీ అభ్యర్థిగా మంత్రి పి.నారాయణ అనుచరుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి బరిలో ఉండడం తెలిసిందే! మిగతా వారు ఎలా వున్నా ఆయనకు ప్రధానపోటీ యూటిఎఫ్‌కు చెందిన యండపల్లి శ్రీనివాసులురెడ్డితోనే ఉండబోతోంది. రాష్ట్ర శాసనమండలిని పునరుద్ధరించాక ఇప్పటికి తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి రెండుసార్లు ఎన్నికలు జరిగితే ఆ రెండుసార్లు కూడా యూటిఎఫ్ అభ్యర్థులే విజయం సాధించడం జరిగింది. వామపక్షాలకు అంత పట్టున్న నియోజకవర్గమిది. ముఖ్యంగా ఉపాధ్యాయ సంఘాలలో కూడా యూటిఎఫ్ పటిష్టంగా వుంది. దాదాపు ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఓటర్లుగా వున్నోళ్లంతా కూడా పట్టభద్రుల నియోజకవర్గంలోనూ ఓటర్లుగా వుంటారు. అదే వారి బలం కూడా!

మరి ఈసారి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని ఎలాగైనా గెలిపించుకు తీరుతానని మంత్రి నారాయణ, చంద్రబాబు వద్ద ప్రగల్భాలు పలికి ఈ మూడుజిల్లాల్లో మిగతా తెలుగుదేశం నాయకులను మాటమాత్రంగా కూడా సంప్రదించకుండానే ఏకపక్షంగా తన మనిషిని అభ్యర్థిగా పెట్టేసాడు. ఇప్పుడు నారాయణ మనుషుల నమ్మకమంతా కూడా తాము కొత్తగా పట్టభద్రుల ఓటర్ల లిస్టులో నమోదు చేయించిన ఓట్లతో గెలుస్తామనే! దాదాపు 60వేల ఓట్లను కొత్తగా చేర్పామంటున్నారు. చేర్పిన ఓట్లన్నీ తమకే పడతాయని వీరి నమ్మకం. ప్రతిఒక్కరూ బోల్తాపడేది ఇక్కడే! నారాయణ సంస్థల్లో పనిచేసే వాళ్లంతా కూడా వారికే ఓట్లు వేస్తారనుకోవడం భ్రమ. యాజమాన్యానికి, లేదా ఒక సంస్థలో పెత్తనం చేసే వారికి వ్యతిరేకంగా ఎప్పుడు ఒక వ్యతిరేకవర్గమనేది ఉంటుంది. నారాయణ సంస్థల్లో కూడా అలాంటివాళ్లున్నారు. ముఖ్యంగా నారాయణ మీద గౌరవమున్నా కూడా చాలామందికి పట్టాభి అంటే పడదు. అలాగే ఈ మూడు జిల్లాల్లో తెలుగుదేశం నాయకులు చాలామంది మంత్రి నారాయణకు వ్యతిరేకంగా వున్నారు. తమను సంప్రదించకుండా అభ్యర్థిని నిర్ణయించారన్న కోపం అందరిలోనూ ఉంది. కాబట్టి పట్టాభికి పార్టీ నాయకుల నుండే పూర్తి సహకారం అందే పరిస్థితి లేదు. పట్టాభద్రులలో విజ్ఞులు, మేధావులు, ఆయా వృత్తుల్లో వున్నోళ్లు వుంటారు. అభ్యర్థిత్వం విషయంలో వారి వ్యక్తిగతాన్ని పరిశీలిస్తారు. కాబట్టి ఆ దశలో పట్టాభి వారి ఆలోచనలకు సరి తూగడు. అలాగే ప్రతిపక్ష వైసిపి తమ అభ్యర్థిని నిలబెట్టలేదు. కాబట్టి వారి సహకారం కూడా యూటిఎఫ్‌కే ఉంటుందనడంలో సందేహం లేదు. పట్టాభి ప్రధాన నమ్మకమంతా కూడా వారు కొత్తగా చేర్చుకున్న ఓటర్లపై లాగే వుంది.


ESTD: 1944
సూటింగ్స్ - షర్టింగ్స్ - రెడీమేడ్స్
మాడరన్ స్టోర్స్
ట్రంక్‌రోడ్డు, నెల్లూరు. ఫోన్: 2326462, 6511611.
మీ ఆదరాభిమానాలతో 72 సంవత్సరములు పూర్తి చేసుకుని
73వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంలో
మా ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు
నూతన సంవత్సర మరియు
సంక్రాంతి శుభాకాంక్షలు.

Raymond | KILLER | Reid & Taylor | Louis Philippe The upper crest.



నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు

Mayuri Restaurant
MULTICUISINE
Pogathota, Nellore
☎ 2329601, 2349679
INDIAN | CHINESE
TANDOOR | MEALS
NELLORE DUM BIRIYANIES
ICE-CREAMS
Carry Home
For HOME DELIVERY
CALL - 2336889
We undertake OUT-DOOR CATER

Venkataramana Vilas
Padmavathi Fast Foods
High Quality Pure Vegetarian
TIFFIN, COFFEE, MEALS, ICE-CREAMS & COOL DRINKS
POGATHOTA, NELLORE. ☎ 2328659, 2349677

# మంత్రితో వివేకా ముచ్చట్లు



రాజకీయాలు చిత్రాతిచిత్రంగా ఉంటాయనేందుకు మంత్రి నారాయణ, మాజీఎమ్మెల్యే వివేకా ఉదంతాలే ఉదాహరణ! 2014 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అధికారంలో ఉండగా వివేకా - నారాయణలు ఉప్పు-నిప్పులాగా ఉండేవాళ్లు. ఒక పీజీ సీటు విషయంలో వీరిమధ్య తేడాలొచ్చి, అది నారాయణ కాలేజీ భవనాలను నిబంధనలను అతిక్రమించి కట్టారని చెప్పి పగులగొట్టే స్థాయి దాకా వెళ్లింది. అయితే ఏ నారాయణ మీద వాళ్లు కక్షగట్టారో ఎన్నికల తర్వాత అదే నారాయణ ఆధ్వర్యంలో తెలుగుదేశంలో చేరారు. ఒకప్పుడు ఆనం ముందు ఎస్ బాస్ అనే స్థాయిలో వున్న నారాయణ ముందు, ఇప్పుడు వీళ్లు నిలబడాల్సిన పరిస్థితి వచ్చింది. ఆదివారం నెల్లూరురూరల్ చింతారెడ్డిపాలెంలోని నారాయణ ఆసుపత్రి ప్రాంగణంలో వున్న నారాయణ ఇంటికి ఆనం వివేకా వెళ్లారు. మంత్రి నారాయణ, వివేకా ఆరోగ్య క్షేమ సమాచారం కనుక్కున్నారు. వివేకా కూడా ఆ రాజకీయ యోధుడితో జిల్లా రాజకీయాలు, ఎమ్మెల్సీ ఎన్నికల గురించి చర్చించారు.

# శుభమస్తు లక్కీడ్రా



నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లోని శుభమస్తు షాపింగ్‌మాల్ వారు క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి పండుగల సందర్భంగా 'లక్షణంగా పండుగలు - లగ్జరీ కార్లు' పేరుతో నిర్వహిస్తున్న స్కీంలో భాగంగా రెండవ లక్కీడ్రాను డిసెంబర్ 26వ తేదీ నిర్వహించారు. నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై లక్కీడ్రా ద్వారా నానోకారు విజేతను ప్రకటించారు. కావలికి చెందిన మాల్యాద్రి కారును గెలుచుకున్నారు. అలాగే డిప్యూటీ మేయర్ యం.ద్వారకానాథ్ పట్టుచీర డ్రా తీయగా సి.హెచ్.సుబ్రహ్మణ్యం విజేతగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మాల్ అధినేతలు బయ్యా శ్రీనివాసులు, రవి కుమార్ పాల్గొన్నారు.

# ముగిసిన దేహదారుఢ్య పరీక్షలు



పోలీస్ కానిస్టేబుళ్ళ నియామకానికి సంబంధించి నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న దేహదారుఢ్య పరీక్షలు 24వ తేదీతో ముగిసాయి. మొత్తం 5850 మంది ఈ పరీక్షలకు హాజరు కాగా 3806మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఈ అభ్యర్థులందరు కూడా జనవరి 22వ తేదీ విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు జిల్లాల్లో వారికి కేటాయించిన కేంద్రాల్లో జరిగే చివరి వ్రాత పరీక్షలకు హాజరు కావాల్సి వుంటుంది. పరీక్ష ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుంది. జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ, ఏఎస్పీ శరత్‌బాబుల పర్యవేక్షణలో ఈ పరీక్షలు జరిగాయి.

# కిడ్నీ వ్యాధులపై వాకర్స్‌కు అవగాహన



ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో, ఏసి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన వాకర్స్‌కు మూత్రపిండాల వ్యాధులపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కిమ్స్ డాక్టర్ చక్రవర్తి, అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వేలూరు రంగారావు, స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి పొన్నం రవిచంద్ర, నలుబోలు బలరామయ్యనాయుడు, ఎస్.రాఘవేంద్రషెట్టి తదితరులు పాల్గొన్నారు.

### 8న మూలస్థానేశ్వరుడికి

# ముక్కోటి తెప్పోత్సవం

**- ఆల్తూరు గిరీష్‌రెడ్డి**



ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరు మూలాపేటలోని శ్రీ భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో జనవరి 8వ తేదీన తెప్పోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు దేవస్థానం పాలకమండలి ఛైర్మెన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి, ఇఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 1న స్వామి, అమ్మవారికి పూలంగి సేవలు జరుగుతాయన్నారు. ఉదయం అయిదు గంటల నుండి భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. ఆరుద్రోత్సవంలో భాగంగా జనవరి 11న శివ ముక్కోటి సందర్భంగా శివకామసుందరీ సమేత నటరాజస్వామి వారికి విశేషాభిషేకాలు జరుగుతాయన్నారు.

### పి.వి ని స్మరించుకున్న

# నెల్లూరీయులు

కష్టకాలంలో భారతదేశాన్ని ఆర్థిక సంస్కరణలతో ముందుకు నడిపిన మాజీ ప్రధాని స్వర్గీయ పి.వి.నరసింహారావును సొంత కాంగ్రెస్‌పార్టీ వాళ్లు మరచినా, సొంత తెలంగాణ వాళ్లు పెద్దగా పట్టించుకోకపోయినా, నెల్లూరీయులు మాత్రం స్మరించుకున్నారు. డిసెంబర్ 23వ తేదీ ఆయన వర్ధంతి సందర్భంగా నెల్లూరులోని గాంధీబొమ్మ వద్ద ఆయన చిత్రపటాన్ని పెట్టి దండలు వేసి నివాళులర్పించారు. ఆయనను స్మరించుకున్న వారిలో మేయర్ అబ్దుల్ అజీజ్, విజయడెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మాజీఎమ్మెల్యేలు సి.వి.శేషారెడ్డి, ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, జిల్లా గ్రంథాలయసంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జడ్.శివప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## విఐపిల సందడి

2016 సంవత్సరం, డిసెంబర్ నెల చివరిలో నెల్లూరుజిల్లాలో విఐపిల సందడి చోటుచేసుకుంది. మంగళవారం కేంద్రమంత్రులు యం.వెంకయ్యనాయుడు, ప్రకాశ్ జవదేకర్‌లు నెల్లూరుజిల్లాలో పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. అలాగే అదేరోజు సూళ్లూరుపేట కేంద్రంగా జరిగిన పక్షుల పండుగకు, కేంద్రమంత్రుల కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రులు గంటా శ్రీనివాసరావు, సిద్దా రాఘవరావు, పి.నారాయణలు హాజరయ్యారు.

## కొత్త సంవత్సరానికి ముస్తాబు

2016 పాత సంవత్సరం వీడ్కోలు, 2017 నూతన సంవత్సర ఆహ్వానానికి నెల్లూరు నగరం ముస్తాబైంది. నోట్ల రద్దు కష్టాల నుండి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న జనం తమ స్థాయికి తగ్గట్లు కొత్త సంవత్సరం వేడుకలకు సిద్ధమవుతున్నారు. న్యూఇయర్ సందర్భంగా వివిధ వ్యాపార, వాణిజ్య సంస్థలు ప్రత్యేక ఆఫర్‌లు ప్రకటించడం తెలిసిందే! కొత్త సంవత్సరం అంటే ఎక్కువ దృష్టి మద్యం, మాంసాహారం అమ్మకాల మీదే ఉంటుంది. బార్‌లు, వైన్‌షాపులు, రెస్టారెంట్లలో డిసెంబర్ 31 రాత్రి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

### నెల్లూరీయులకు కానుకగా

# యంవిఆర్ మాల్



నెల్లూరు, ట్రంకురోడ్డులో చందన బ్రదర్స్ పక్కన సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన యంవిఆర్ మాల్‌ను డిసెంబర్ 23వ తేదీన జగద్గురు శంకరాచార్య విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ దినదిన ప్రవర్ధమానం కావాలని స్వామి ఆశీస్సులందజేశారు. ఈ కార్యక్రమంలో మాల్ అధినేత మావూరి శ్రీనివాసరావు, రాజీయాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, హిందూ ధర్మకర్తల మండలి అధ్యక్షులు సి.వి.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు కొండా శేఖర్‌రెడ్డి, జడ్.శైలేష్ తదితరులు పాల్గొన్నారు.

### గీతామయి వృద్ధాశ్రమంలో

# ఉచిత వైద్య శిబిరం



నెల్లూరు బాలాజీ నగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో జయచంద్ర నర్సింగ్‌హోమ్ ఆధ్వర్యంలో ఆదివారం కీళ్లు, ఎముకలు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. జయచంద్ర నర్సింగ్‌హోమ్ వ్యవస్థాపకుడు డాక్టర్ జయచంద్ర, డాక్టర్ శైలేష్, డా॥ ప్రభావతి, డా॥ ఐ.శ్రీజ పాల్గొని దాదాపు 200మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. వృద్ధాశ్రమ వ్యవస్థాపకుడు తమ్మినేని పాండు, రవికుమార్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ప్రదాత వాజ్‌పేయి

భారతరత్న అవార్డు గ్రహీత, మాజీప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అభివృద్ధి ప్రదాతని నెల్లూరుజిల్లా బీజేపీ అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి అన్నారు. 25వ తేదీ వాజ్‌పేయి 92వ జన్మదినం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో నెల్లూరు జయభారత్ హాస్పిటల్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేంద్రరెడ్డి మాట్లాడుతూ దేశంలో స్వర్ణచతుర్భుజ నాలుగులైన్లు, ఆరులైన్ల రోడ్లను వేయించి జాతీయ రహదారులపై వాహనాలు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేసిన ఘనత వాజ్‌పేయికి దక్కుతుందన్నారు. పార్టీలోని ప్రతి కార్యకర్త వాజ్‌పేయి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. బీజేపీ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి కుడుముల సుధాకర్‌రెడ్డి, నాయకులు గడ్డం విజయకుమార్, బండారు శ్రీనివాసులు, గుండాల రామకృష్ణారెడ్డి, పేరిశెట్టి రమణయ్య, రంగరాజన్, నరశింహులు నాయుడు, మండ్ల ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇక... నెల్లూరు అర్బన్ తహశీల్దార్



***పాతిక, ముప్పై వేల జనాభా ఉండే మండలానికి ఒక తహశీల్దార్... బాగానే వుంది. మరి 7లక్షల జనాభా వుండే నగరానికి కూడా ఒకే తహశీల్దార్... ఇప్పటి దాకా ఇదే విచిత్రం. ఆఖరకు ఈ నగరాన్ని రెండు అసెంబ్లీలుగా చేసి ఇద్దరు ఎమ్మెల్యేలను ఎన్నుకున్నారు. కాని ఇంతకాలం ఇంత జనాభాకు తహశీల్దార్ ఒక్కడే!***

ఎట్టకేలకు ఆ కొరత తీరింది. నెల్లూరు అర్బన్ తహశీల్దార్ రాబోతున్నాడు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొత్తగా ఏడు అర్బన్ తహశీల్దార్ కార్యాలయాలను మంజూరు చేయగా, వాటిలో నెల్లూరు అర్బన్ కూడా ఉండడం విశేషం. ఇంతకాలం నెల్లూరు నగరంతో పాటు నెల్లూరురూరల్ మండలానికి కలిపి ఒకే తహశీల్దార్ ఉంటున్నాడు. ముగ్గురు డిప్యూటీ తహశీల్దార్లు, ఇద్దరు ఆర్ఐలు, 27మంది విఆర్ఓలు ఉన్నారు. అయితే ఇంత జనాభాకు పూర్తి స్థాయిలో పని చేయడం వీరివల్ల కావడం లేదు. అసలు నెల్లూరు తహశీల్దార్ ప్రజలకు అందుబాటులో వుండడమే గగనమవుతుంది. ఎందుకంటే ఇది జిల్లా కేంద్రం కావడం, ప్రజాప్రతి నిధులతో పాటు ఉన్నతాధికారులు కూడా నెల్లూరుకు వస్తుండడంతో తహశీల్దార్ సగం పని ప్రోటోకాల్ విధులకే సరిపోతుంది. కనీసం రెండో తహశీల్దారన్నా వస్తే పని ఒత్తిడి చాలా తగ్గుతుంది. ప్రజలకు కూడా సౌకర్యవంతంగా ఉంటుంది.

## కష్టించే వారికి గుర్తింపు



కష్టపడి పని చేసేవారికి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో గుర్తింపు ఉంటుందని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. వైకాపాలో ఇటీవల పలు పదవులు పొందిన నాయకులను డిసెంబర్ 26వ తేదీన ఆయన నెల్లూరులోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అభినందించారు. ప్రతిపక్ష నాయకులుగా మనపై రెండు బాధ్యతలున్నాయని, ఓ పక్క ప్రజల సమస్యలపై పోరాడుతూ, ఇంకో పక్క ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

## నోట్ల రద్దుపై బాబు రోజుకోమాట...



పెద్దనోట్ల రద్దుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రోజుకోమాట మాట్లాడుతున్నాడని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు వై.వి.సుబ్బారెడ్డి, నెల్లూరు పార్ల మెంటు సభ్యులు మేకపాటి రాజమోహన్ రెడ్డిలు విమర్శించారు. డిసెంబర్ 26వ తేదీ నెల్లూరులోని వైకాపా జిల్లా కార్యా లయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వాళ్లు మాట్లాడారు. పెద్ద నోట్లు రద్దు చేయమని ప్రధానికి తానే సలహా ఇచ్చానని చంద్రబాబు చెప్పాడు. ప్రజల్లో వ్యతిరేకత వచ్చాక నోట్ల రద్దుపై మాట మార్చి తనకే అసహనంగా వుంద న్నాడు. దీన్నిబట్టి చంద్రబాబుకు ఎన్ని నాలుకలు ఉన్నాయో అంతుబట్టడం లేదు. నల్లధనం వెలికితీసేందుకు కేంద్రం తీసు కున్న నిర్ణయాన్ని వైకాపా కూడా స్వాగతిం చింది. అయితే దీని మూలంగా సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలపైనే మా పార్టీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా నోట్ల రద్దు తర్వాత వచ్చిన కొత్త నోట్లు కూడా వేల కోట్లలో నల్ల కుబేరుల వద్దకే చేరడం విచారకరం. దీనిపై విచారణ చేయాలి. నోట్ల రద్దు తర్వాత వృద్ధులకు పింఛన్‌లు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేకపోవడం చంద్రబాబు పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. నెల్లూరు స్థానిక సంస్థల శాసనమండలికి జరిగే ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి బరిలో వుంటా డని వారు తెలిపారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో మా పార్టీ అభ్య ర్థులే ఎక్కువుగా గెలిచారు. నెల్లూరుజిల్లా వైకాపాకు కంచుకోట లాంటిది. పార్టీ అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డితో చర్చించి త్వరలోనే నెల్లూరు స్థానిక సంస్థల శాసనమండలి అభ్యర్థిని వెల్లడిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీఎమ్మె ల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వైకాపా నాయకులు ఎల్లసిరి గోపాలరెడ్డి, మేరిగ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.









డా॥ సి.మధుసూదనరెడ్డి

జననం: 04.11.1950 మరణం: 31.12.2005

# స్మృత్యంజలి

ఆత్మీయానుబంధాలను మాకు పంచి
చెదరని మీ చిరునవ్వును మాకు మిగిల్చి
మీరు మాకు దూరమై పదకొండేళ్లు గడుస్తాయి.

**మరపురాని మీ మధురస్మృతులతో...**

తల్లి : చిట్టమూరు అనసూయమ్మ
భార్య : డాక్టర్ చిట్టమూరు భారతి
కుమారుడు : చిట్టమూరు లోహిత్
కుమార్తె : చిట్టమూరు ప్రణీత
చెల్లెలు : నిర్మల
అల్లుడు : అరవింద్ దినకర్
బావ : డా॥ సి.యం.కె.రెడ్డి
మరియు కుటుంబసభ్యులు

# కల్యాణ వైభవం...!



ఏఎస్‌పేట మండలం, రాజవోలు వాస్తవ్యులు ముంగమూరు జగన్మోహన్‌రెడ్డి - సుమనల కుమార్తె **హిమజరెడ్డి - అనురాగ్‌రెడ్డి** (వైయస్సార్ కడపజిల్లా పులివెందుల వాస్తవ్యులు సర్రెరెడ్డి శివప్రకాశ్‌రెడ్డి - అరుణల కుమారుడు)ల కల్యాణం డిసెంబర్ 14వ తేదీ బెంగుళూరులోని రాయల్ సెనెట్ నందు వైభవంగా జరిగింది. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వై.యస్.జగన్మోహన్‌రెడ్డితో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు, కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు ఈ వివాహ వేడుకకు హాజరై వధూవరులను దీవించారు. నూతన దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.



సాక్షి దినపత్రిక నెల్లూరు ఎడిషన్‌లో సబ్‌ఎడిటర్‌గా పనిచేస్తున్న **రామకృష్ణ - సునీత** (ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం కె.పి.అగ్రహారం వాస్తవ్యులు తొగరుచీటి శివరామాచార్యులు - మల్లీశ్వరిల కుమార్తె)ల వివాహం డిసెంబర్ 9వ తేదీ నెల్లూరులోని గుర్రం బాబయ్య కళ్యాణ మండపం నందు జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభదీవెనలు.



# గూడూరు డివిజన్ వార్తలు

## విద్యార్థులే బైక్‌ల దొంగలు



గూడూరు, కోట, వాకాడు, చిట్టమూరు, నాయుడుపేట, సూళ్లూరు పేట, తడ, నెల్లూరుల్లో మోటారు సైకిళ్లు చోరీలు చేసిన నిందితులను వాకాడు సిఐ అక్కేశ్వర రావు ఆధ్వర్యాన కోట, వాకాడు, చిట్టమూరు, ఓజిలి ఎస్సైలు అజయ్‌కుమార్, వెంకటరెడ్డి, గోపాల్, సాంబశివరావు, ఐడి పోలీసులు ఆర్.వి.రాజు, సుబ్బారావు, కృష్ణల సహకారంతో కొండుగుంట వద్ద అరెస్ట్ చేసినట్లు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ సోమవారం వెల్లడించారు. రామ్‌ప్రకాష్, పవన్‌కళ్యాణ్, పి.శ్రీనివాసులు, చైతన్య, జశ్వంత్, బి.శ్రీనివాసులు, వెంకయ్య, భరత్ అనే ఎనిమిది మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు, మరో నలుగురు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన రూ.24లక్షల విలువచేసే 31 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పీ తెలిపారు. కొందరు విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలై, తమలో ఉన్న ప్రతిభను దొంగతనాలు చేసేందుకు ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. కోట, వాకాడు మండలాలకు చెందిన 12 మంది పలు కళాశాలల్లో చదివే విద్యార్థులు, యువకులు ముఠాగా తయారయినట్లు తెలిపారు. మోటారుసైకిళ్ల చోరీలను ఛేధించి నిందితులను పట్టుకున్న పోలీసు అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు.

## ఆసక్తి పెంచుకోండి

గూడూరు మాలవ్యానగర్‌లోని ఎస్టీ గురుకుల పాఠశాలను డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ఈదూరు సుధాకర్ తనిఖీ చేశారు. హాస్టల్‌లోని వంట గదులను, బాత్‌రూమ్‌లను, విద్యార్థులు వుంటున్న గదులను ఆయన పరిశీలించారు. పిల్లలకు వండి పెడుతున్న వంటలను రుచి చూశారు. చదువుపై ఆసక్తి పెంచుకోవాలని, శ్రద్ధగా చదువుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందని ఆయన విద్యార్థులకు బోధించారు.



ఈ నెల 26వ తేదీ గూడూరులోని రోడ్లు భవనాల అతిథిగృహం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టభద్రుల తెలుగుదేశం ఎంఎల్‌సి అభ్యర్థి వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ నాయకులకు పిలుపునిస్తున్న ఎమ్మెల్యే పి.సునీల్‌కుమార్, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తదితరులు




ఈ నెల 27వ తేదీ ప్రజాసమస్యల పరిష్కారం కోసం గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గూడూరు సిపిఐ(ఎం) పార్టీ నాయకులు

## అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలు

గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రోటరీ క్లబ్, హరిచంద్రారెడ్డి, అల్లూరు ఆదిశేషారెడ్డి క్రికెట్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. మైదానంలో విద్యాలయ డిగ్రీ కళాశాల, శ్రీనివాస డిగ్రీ కళాశాల జట్ల మధ్య జరిగిన పోటీలో శ్రీనివాస డిగ్రీ కళాశాల జట్టు గెలుపొందింది. మరో పోటీలో ఆదిశంకర పాలిటెక్నిక్ కళాశాల, ఎస్‌కెఆర్ ప్రభుత్వ కళాశాలల మధ్య జరిగిన రసవత్తర పోటీలో ఆదిశంకర జట్టు గెలుపొందింది. శ్రీనివాస డిగ్రీ, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల మధ్య జరిగిన పోటీలో ఎస్వీ ఆర్ట్స్ జట్టు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి విజయాన్ని సొంతం చేసుకుంది. క్రికెట్ మ్యాచ్‌లకు అంపైర్లుగా లవకుమార్, చంటి, ఉదయ్ కుమార్, శంకర్‌లు వ్యవహరించగా నిర్వాహకులు నాగసూరి గోపాలరావు, కె.మునిగిరీష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


శుభాకాంక్షలు
తెలుగుదేశంపార్టీ నాయకులకు, కార్యకర్తలకు, గూడూరు ప్రజానీకానికి, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
2017 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.
కోడూరు శ్రీనివాసులురెడ్డి
టిడిపి సీనియర్ నాయకులు
గూడూరు



మా క్లయింట్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
గూడూరు ప్రాంత ప్రజానీకానికి
2017 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.
S. RAMA MOHAN RAO, B.Com., FCA
S.V. Ratnam & Co.,
Chartered Accountants
13/160, Thyagaraja Street, Gudur - 524 101, Nellore Dist., A.P. Tel: 08624 - 52143.





గూడూరు ప్రాంత ప్రజలకు, పేషంట్లకు, డాక్టర్లకు, మిత్రులకు, మా శ్రేయోభిలాషులకు
2017 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.
డా॥ జి.మైథిలి
యం.బి.బి.యస్. యండి., డి.జి.ఓ., ఎఫ్.ఎ.జి.ఐ.
కాన్పులు, గర్భకోశ వ్యాధుల నిపుణులు
మైథిలి హాస్పిటల్
కూరగాయల మార్కెట్ దగ్గర, ఐ.సి.యస్.రోడ్డు, గూడూరు.
ఫోన్. 08624 - 253896.




శుభాకాంక్షలు
రాష్ట్ర పంచాయతిరాజ్ డిప్లొమా ఇంజనీర్ల సంఘ అధ్యక్షులు మరియు రాష్ట్ర ఉద్యోగసంఘ జె.ఎ.సి. వైస్‌ఛైర్మెన్
షేక్ రియాజ్ అహమద్ గారికి
2017 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.
ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారితో షేక్ రియాజ్ అహ్మద్
పంచాయితిరాజ్ డిప్లొమా ఇంజనీర్ల సంఘం
నెల్లూరుజిల్లా యూనిట్.



మా ఖాతాదారులకు, మిత్రులకు మరియు శ్రేయోభిలాషులకు
2017 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు...
మీ... Rtn. మయూరి శ్యామ్ యాదవ్
ప్రొప్రయిటర్
సెల్. 99486 06664
88855 24000
మయూరి స్వీట్స్ & బేకరి
ఎన్.టి.ఆర్. షాపింగ్ కాంప్లెక్స్, పాత బస్టాండ్, గూడూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా.
మా బ్రాంచ్‌లు: సంగం థియేటర్ దగ్గర, హాస్పిటల్ రోడ్డు, గూడూరు | వనజాక్షమ్మ కళ్యాణ మండపం ఎ/సి సొసైటీ రోడ్డు, గూడూరు.

# రామరాజ్యం కోసమే నోట్ల రద్దు!

శ్రీను గల్పిక

ఢిల్లీలోని ప్రధాని కార్యాలయం. ప్రధాని నరేంద్ర మోడీ పొద్దున్నే యోగాసనాలు పూర్తిచేసి వేడివేడిగా తాగుదామని స్టౌమీద టీ కాచుకుంటున్నాడు. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు అప్పుడే అక్కడకు వెళ్లాడు. స్టౌమీద టీని చూసి... అబ్బా మీరు టీ కాస్తున్న పద్ధతి చాలా బాగుంది సార్... రుచి, వాసన, చిక్కదనం... మూడు సుగుణాల కలయిక త్రీరోజెస్ టీ లాగుంది... అని అన్నాడు. అందుకు మోడీ... ఇది నా సొంత బ్రాండ్ టీ. తేయాకుతో టీపొడిని నేనే తయారు చేసుకుంటానని చెప్పాడు. అప్పుడు వెంకయ్య... నాకో ఐడియా వచ్చింది సార్, వచ్చే ఎన్నికల్లో మోడీ బ్రాండ్ టీ అని దీనిని వదులుదాం. మోడీ బ్రాండ్ టీ ప్యాకెట్లు ఫ్రీగా ఇద్దాం. టీ తాగిన విశ్వాసం వున్న ప్రతిఒక్కరూ మనకు ఓట్లు గుద్దుతారని చెప్పాడు. దానిని తర్వాత ఆలోచిద్దాంగాని, నువ్వు కూడా టీ తాగుతావా అని మోడీ అడిగాడు. దానికి వెంకయ్య... ఇప్పటిదాకా మీ టీని పొగిడిందందుకే కదా సార్, నా దగ్గర టీకి చిల్లర లేవు. పాలప్యాకెట్‌కు కూడా డబ్బుల్లేవు. మీ దగ్గరైతే ఫ్రీగా టీ తాగిపోవచ్చునని వచ్చానన్నాడు. అంతలో కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అనంత కుమార్, సురేష్‌ప్రభు, మనోహర్ పారికర్‌లు కూడా వచ్చారు. ఎమర్జెన్సీ పనులేమన్నా ఉన్నాయా, అందరూ ఇంత పొద్దున్నే కట్ట కట్టుకుని వచ్చారని మోడీ అడిగాడు. టీ తాగుదామంటే ఎవరి దగ్గరా చిల్లర లేదు, ఇంట్లో టీ అడిగితే పాలప్యాకెట్టు కొనుక్కు రమ్మంటున్నారు. అందుకే మీ దగ్గర అయితే ఫ్రీ చాయ్ ఉంటుందని వచ్చామన్నారు. దాంతో మోడీ మరుగుతున్న టీ పాత్రలో మరో అరలీటర్ నీళ్లు పోసాడు. తర్వాత ఆయనే... నా దగ్గరా పాలకు డబ్బులు లేవు. రాత్రి పావులీటర్ పాలు మిగిలి వుంటే ఆ స్టౌ మీద పెట్టాను, వాటితోనే అందరం సర్దుకుందామన్నాడు.

అంతలో అక్కడకు 'ష్ గప్‌చుప్' టీవీ ఛానెల్ బృందం వచ్చింది. మోడీ ఇంటర్వ్యూ కావాలని కోరారు. అందుకు మోడీ సరేనన్నాడు.

ష్ గప్‌చుప్ : సార్, మీరు నల్లకుబేరులపై యుద్ధం ప్రకటించారు. కారణం?

మోడీ : మన దేశాన్ని దోచుకున్న తెల్లదొరలపై యుద్ధం చేద్దామనుకుంటే ఇప్పుడు వాళ్లు లేరు. అందుకే ఇప్పుడు దేశాన్ని దోస్తున్న నల్లదొరలపై యుద్ధం చేస్తున్నాను. ఆ విధంగా నా కోరిక తీర్చుకుంటున్నాను!

ష్ గప్‌చుప్ : పెద్దనోట్లను రద్దు చేయాలన్న ఆలోచన మీకెందుకొచ్చింది?

మోడీ : నా దగ్గర ఆ నోట్లు పెద్దగా లేవు కాబట్టి!

ష్ గప్‌చుప్ : పెద్దనోట్లను రద్దు చేయడం ద్వారా మీరేం సాధించదలచుకున్నారు?

మోడీ : సమ సమాజాన్ని.

ష్ గప్‌చుప్ : అదెలా...

మోడీ : నేను ఈ దేశంలో సమసమాజాన్ని కలగన్నాను. ఇది పూర్తి కాలం ఉండాలంటే కష్టమేనని నాకు అర్థమైంది. కనీసం ఒక నెలన్నా సమసమాజాన్ని చూడాలనుకున్నాను. అందుకే పెద్ద నోట్లను రద్దు చేశాను. దేశంలో ఎవరి వద్ద ఒక నెలపాటు కరెన్సీ లేకుండా చేసాను. కాబట్టి పేదోడు, పెద్దోడు ఒకే రకం తిండి తిన్నారు. ఒకే రకం బట్ట కట్టారు. ఒకే రకమైన జీవన విధానాన్ని అవలంభించారు.

ష్ గప్‌చుప్ : పెద్దనోట్ల రద్దు వెనుక ఇంకేదైనా ఉద్దేశ్యముందా?

మోడీ : పరోక్షంగా వేరే ఉద్దేశ్యముంది. దేశవ్యాప్తంగా 27కోట్ల మంది చేత జన్‌ధన్ ఖాతాలు తెరిపించాను. కాని వాటిలో వేయడానికి ప్రభుత్వం వద్ద డబ్బులు లేవు. పెద్దనోట్లు రద్దు చేసాక పెద్దోళ్లందరూ తమ అకౌంట్లలో బ్లాక్‌మనీ కట్టుకోలేక ఈ జన్‌ధన్ ఖాతాలలో కట్టారు. ఆ విధంగా నోట్ల రద్దు వల్ల జన్‌ధన్ ఖాతాలలోకి డబ్బులు తెప్పించగలిగాను.

ష్ గప్‌చుప్ : గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు సహారా, బిర్లా కంపెనీల నుండి ముడుపులు తీసుకున్నారని రాహుల్‌గాంధీ ఆరోపించారు కదా? దీనికి మీ సమాధానం.

మోడీ : ఆయన ఆరోపణలు నిజం కావని ఆయనే చెప్పారు కదా!

ష్ గప్‌చుప్ : ఎలా?

మోడీ : నేను నోరు తెరిస్తే భూకంపం వస్తుందని ఆయన అన్నారు. మరి నోరు తెరిచినా కూడా భూకంపం రాలేదంటే ఆయన ఆరోపణలు అబద్ధమనేగా! అదీగాక ఆయన నోరు తెరిస్తే మన దేశంలో లేకుండా విదేశాలలో భూకంపాలు వస్తున్నాయి. కాబట్టి ఆయన మూలాలు విదేశాలలో వున్నాయని అర్థమవుతుంది.

ష్ గప్‌చుప్ : కొత్త నోట్ల కోసం దేశ ప్రజలు 50రోజులుగా బ్యాంకుల ముందు, ఏటిఎంల ముందు క్యూలలో నిల్చుంటున్నారు. 50రోజుల తర్వాత ఆ కష్టాలు ఉండవంటున్నారు. ఇది జరిగే పనేనా? నిజంగా కష్టాలు తొలుగుతాయా?

మోడీ : కష్టాలు తొలుగుతాయని నేను చెప్పలేదు. కష్టాలు అలవాటవుతాయని చెప్పాను. 50రోజులు 'క్యూ'లలో నిలబడ్డ వారికి ఇక జీవితాంతం కూడా 'క్యూ'లలో నిలవడం పెద్ద సమస్య కాదు.

ష్ గప్‌చుప్ : 2వేల నోటును రద్దు చేస్తారనే ప్రచారం జరుగుతోంది! నిజమేనా?

మోడీ : నిజమే, రేపు 2వేల నోట్లు రద్దు చేస్తాం, ఆ తర్వాత కొత్తగా విడుదల చేసిన 500నోట్లతో పాటు పాత 100, 50, 20, 10, 5రూపాయల నోట్లను కూడా రద్దు చేస్తాం?

ష్ గప్‌చుప్ : అదేంటి... కరెన్సీ మొత్తం రద్దు చేస్తే దేశ ఆర్థిక వ్యవస్థ ఎలా నడుస్తుంది? దేశంలో పూర్తి డిజిటలైజేషన్ కావాలంటే ఇంకా ఇరవై, ముప్పై ఏళ్లన్నా పడుతుంది కదా!

మోడీ : అక్కడే పప్పులో కాలేసావ్! కరెన్సీకి డిజిటలైజేషన్‌కు సంబంధం లేదు. ఈ దేశాన్ని క్యాష్‌లెస్ దేశంగా చేయాలనుకుంటున్నాం.

ష్ గప్‌చుప్ : అలా ఎందుకు చేయాలనుకుంటున్నారు?

మోడీ : రామరాజ్యం కోసం... ఎన్నికల్లో దేశంలో రామరాజ్యం తెస్తామని వాగ్దానం చేసాం కదా!

ష్ గప్‌చుప్ : పూర్తిగా కరెన్సీ రద్దు చేస్తే రామరాజ్యం వస్తుందా?

మోడీ : నాకు నోరు నొప్పిగా వుంది, దీనికి వెంకయ్య సమాధానం చెప్తాడు, నువ్వు చెప్పు వెంకయ్యాజీ!

వెంకయ్య : అవును, రామరాజ్యం కోసమే కరెన్సీని రద్దు చేయాలనుకుంటున్నాం. రాముడి కాలంలో కరెన్సీ ఉండేది కాదు. కాబట్టి అప్పుడు అవినీతి, దొంగతనాలు, కిరాయి హత్యలు, ఆస్థి గొడవలు ఉండేవి కావు. మనుషుల మధ్య ప్రేమాభిమానాలు ఉండేవి. అందరూ రోజూ పనులు చేసుకుంటూ ఆరోగ్యంగా ఉండేవాళ్లు. పండుగలు బాగా చేసుకునేవాళ్లు. డబ్బుల్లేక పోబట్టే ఆరోజు ధర్మం నాలుగు పాదాల మీద నడిచింది. ఈరోజు డబ్బుండబట్టే దేశంలో దుర్మార్గాలు పెరిగాయి. ధర్మం కుంటిదైంది. మనిషి కార్లు, విమానాలలో తిరుగుతూ సోమరిపోతయ్యాడు. కార్లు వచ్చాక కాళ్లకు పనిలేకుండా పోయింది. మిషన్‌లు వచ్చాక మనిషి నడుం వంచడం మానేసాడు. డబ్బుల కోసం అన్నదమ్ములే చంపుకుంటున్నారు. ఇన్ని అరిష్టాలకు మూలమైన డబ్బును ఈ దేశంలో లేకుండా చేయాలన్నది మా సంకల్పం! ఆ డబ్బు అనే రావణాసురుణ్ని వధిస్తే ఈ దేశంలో వచ్చేది రామరాజ్యమే కదా! డబ్బులు లేకుండా చేస్తే కార్లలో తిరిగేవాళ్లు కాళ్లతో తిరుగుతారు, ఆకాశంలో తిరిగేవాళ్లు నేలపై నడుస్తారు. పిజ్జాలు, బర్గర్‌లు తినేవాళ్లు శుభ్రంగా రాగి సంగటి, జొన్నరొట్టెలు తింటూ ఆరోగ్యంగా ఉంటారు. డబ్బుల కోసం ఒకర్నొకరు చంపుకోవడం, పోలీస్‌స్టేషన్‌లు, కోర్టుల చుట్టూ తిరగడం ఉండదు. రామరాజ్యంలో ఇవన్నీ ఉండవు కదా అని వెంకయ్య చెబుతుండగా, 'డబ్' అనే శబ్ధం వచ్చింది. అందరూ ఆదుర్దాగా చూడగా... 'ష్ గప్‌చుప్' విలేకరి క్రిందపడి గిలగిల కొట్టుకోసాగాడు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థిక వ్యవహారాలను జాగ్రత్తగా నిర్వహిస్తారు. వృత్తి వ్యాపారాలు కొంత మెరుగుగా ఉండి ఆదాయం పెరుగుతుంది. అయితే తప్పనిసరి ఖర్చుల భారం తప్పదు. పనులన్నీ నిదానంగా జరుగుతాయి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కావచ్చు. అధికారుల అనుకూలత ఉద్యోగులకు బాగుంటుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. శుభవార్తలు వింటారు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

సమస్యలుండినా సమర్ధవంతంగా నిర్వహిస్తారు. అధికారుల ప్రసన్నత ఉద్యోగులకు బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఆదాయం తగ్గుతుంది. కోర్టు కేసులందు కొంత ఊరట ఉంటుంది. వ్యాపారులకు అధికారుల వల్ల సమస్యలుంటాయి. బిడ్డల విద్యా వివాహ శుభకార్యాలపై దృష్టి పెడతారు. స్నేహితుల సహకారం బాగుంటుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వ్యాపారపరంగా అభివృద్ధి పెట్టుబడి అవకాశాలు బాగుంటాయి. యజమానులు వర్కర్లతో జాగ్రత్తగా ఉండండి. ఉద్యోగులు సహచరులతోను పబ్లిక్‌తోను జాగ్రత్తగా ఉండండి. బంధుమిత్రుల ప్రోత్సాహం బాగుండి కొత్త ఆర్థికాభివృద్ధి ప్రయత్నాలు చేస్తారు. పనులు అనుకున్న విధంగా నిర్వహించగలరు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఖర్చులు పెరుగుతాయి. కుటుంబంలో అపార్థాలు చోటు చేసికొనకుండా జాగ్రత్తపడాలి. రావలసిన బాకీలు నిలబడిపోతాయి. అనుకున్న పనులకు ఆటంకాలు కలగడం వల్ల చికాకుగా ఉంటుంది. గృహ రిపేర్లు, వస్తు వాహన రిపేర్లుంటాయి. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. అవసరాలకు ఋణం చేయవలసి రావచ్చును. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగిపోతాయి. అనుకోని అదనపు ఖర్చులుంటాయి. జాగ్రత్త పడవలసి ఉంటుంది. కొత్త పరిచయాలు, బంధుత్వాలు బలపడతాయి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. చిన్న వ్యాపారులు, కాంట్రాక్టర్లకు ఇబ్బంది రోజులివి. అధికారుల వల్ల సమస్యలు రాగలవు. ఉద్యోగులకు అదనపు బాధ్యతలుంటాయి. క్రయవిక్రయాలు వాయిదా పడతాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలలో వేసికొన్న ప్రణాళిక ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఆదాయం బాగుంటుంది. అయితే ఆశించిన అదనపు ఖర్చుల వల్ల ఋణం చేయవలసి వస్తుంది. వస్తు నష్టము, వాహన రిపేర్లు, కుటుంబ సభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. అనుకున్న పనులను పట్టుదలతో జరుపుకొంటారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 30.12.2016 నుండి
తేది. 5.1.2017 వరకు

ఈ వారం ధనుర్మకర కుంభ మీన రాశులలో చంద్రుడు, సింహంలో రాహువు, కన్యలో గురువు, వృశ్చికంలో శని, ధనుస్సులో రవిబుధులు, కుంభంలో కుజ శుక్రకేతువులు సంచరిస్తారు.

**పంచాంగము**

తేది 30 శుక్రవారము ధనుర్మాస, పుష్య మాసాల కలయికతో శూన్యమాసారంభము.

తేది 1 ఆదివారము నూతన ఆంగ్ల సంవత్సరము 2017 ప్రారంభము.

**పుష్య మాస శుక్లపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 30 | శుక్ర | పాడ్యమి | ప॥ గం.1.20వ॥ |
| తేది. 31 | శని | విదియ | ప॥ గం.2.10వ॥ |
| తేది. 1 | ఆది | తదియ | ప॥ గం.2.27వ॥ |
| తేది. 2 | సోమ | చతుర్థి | ప॥ గం.2.16వ॥ |
| తేది. 3 | మంగళ | పంచమి | ప॥ గం.1.33వ॥ |
| తేది. 4 | బుధ | షష్టి | ప॥ గం.12.26వ॥ |
| తేది. 5 | గురు | సప్తమి | ప॥ గం.10.55వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఖర్చులను అదుపు చేసుకుంటూ నిర్ధిష్ట ప్రణాళికలతో వృత్తి వ్యాపారాలను నడపండి. సామాన్య ఆదాయానికి లోపం రాదు. ఉద్యోగులకు పని వత్తిడి, కొత్త బాధ్యతలు ఏర్పడతాయి. వ్యాపారవృద్ధికి అవకాశాలు దొరుకుతాయి. పిల్లల వల్ల సమస్యలు వచ్చే అవకాశం ఉన్నది. కుటుంబంలో స్వల్ప భిన్నాభిప్రాయాలుంటాయి. కోర్టు వ్యవహారాలు, కుటుంబ వ్యవహారాలు సర్దుబాటు కావచ్చును.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వ్యవహారాలలోల దూకుడు తొందరపాటు తగ్గించుకొనండి. ఆలోచించి నిర్ణయాలు చేయండి. రావలసిన బాకీలు నిలబడిపోతాయి. ఆర్థిక ఇబ్బందులుంటాయి. అయినవాళ్ళ వల్ల మాటలు పడవలసి వస్తుంది. కావున అనవసర విషయాల జోలికి వెళ్ళవద్దు. శుభకార్య ప్రయత్నాలు ఫలించగలవు. ఉద్యోగులు విధి నిర్వహణ బాధ్యతాయుతంగా చేయండి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

అక్రమ వ్యవహారాలకు ప్రోత్సహిస్తారు. కాబట్టి జాగ్రత్త అవసరం. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. వ్యాపారవృద్ధి ప్రయత్నాలు అనుకూలించగలవు. వ్యవసాయదారులు, వడ్డీ వ్యాపారులకు ఇబ్బంది సమయం. సభలు సమావేశాలలో పాల్గొంటారు. రియల్ ఎస్టేట్, స్టాక్ వ్యాపారులు నష్టపడతారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. అభివృద్ధికి మరింత శ్రమ పడాలి. అదనపు ఖర్చులు పెరుగుతాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. బంధువులతో విభేదాలు కలిగే అవకాశం ఉన్నది. ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం జరుగుతుంది. ఉద్యోగులు అధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. విద్యా ప్రగతి బాగుంటుంది.


## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

సాహస నిర్ణయాలు, తొందరపాటు నిర్ణయాలు చేసే అవకాశం ఉన్నది కాబట్టి జాగ్రత్త పడండి. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. ఖర్చులు పెరిగినా జాగ్రత్తపడగలరు. ప్రముఖులను కలుసుకొనడం, సభలలో పాల్గొనడం జరుగుతుంది. హోల్‌సేల్ వ్యాపారులకు ఇబ్బందులుంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అనుకున్న పనులు సరిగా జరగడానికి మరింత శ్రమ పడాలి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరిగి ఆదాయం ఫరవాలేదనిపించగలదు. ఆర్థిక ఇబ్బందులుండి సమర్థించుకొని ముందుకు పోగలరు. టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. అనవసర విషయాలలోకి పోవడం, సలహాలివ్వడం చేయవద్దు. విద్యార్థులకు మంచి కృషి ఉంటుంది. పెట్టుబడులు నిలబడిపోతాయి.

## కళ్యాణ వైభవం...!



ప్రముఖ నవలా రచయిత సూర్యదేవర రామ్మోహన్‌రావు - పద్మజారాణిల కుమారుడు
**కాళీ అనంత - రోషిణి** (కాట్రగడ్డ భానుప్రసాద్ - శాంతశ్రీల కుమార్తెల కళ్యాణం
డిసెంబర్ 21వ తేదీ హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని దస్‌పల్లా హోటల్ నందు ఘనంగా జరిగింది.
నూతన దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# అద్వాన్నంగా కార్పొరేషన్ పాలన

### - డిప్యూటి మేయర్ ముక్కాల ధ్వజం



నెల్లూరు కార్పొరేషన్ పాలన పరమ అద్వాన్నంగా తయారైందని, మంత్రి నారాయణ దీనిని ఆ స్థితికి తెచ్చారని, నెల రోజులు గడుస్తున్నా కార్పొరేషన్‌కు కమిషనర్‌ను నియమించుకోలేని దుస్థితిలో వుండడం ఎంతో విచారకరమని డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్ ధ్వజమెత్తారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలోని తన ఛేంబర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర అభ్యున్నతికి కార్పొరేషన్ ఎంతో ముఖ్యమని, ఇందులో కీలకమైనది కమిషనరేనని, అసలు కమిషనరే లేకుంటే చేసేదేముందని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ఇప్పుడు కార్పొరేషన్‌లో చిన్న ఫైల్ కూడా కదలని స్థితి ఏర్పడిందన్నారు. ఇన్‌ఛార్జిగా జాయింట్ కలెక్టర్ వున్నప్పటికీ సమయమంతా జిల్లాస్థాయి పనుల వత్తిడితోనే సరిపోతోందన్నారు. కార్పొరేషన్‌లో అవినీతి అక్రమాలపై మేయర్ దృష్టి సారించడం లేదని, నెలరోజుల నుంచి కమిషనర్‌ను నియమించలేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఇటీవల సిటీప్లానింగ్ విభాగంలో పలువురు అధికారులను సస్పెండ్ చేశారని, అయితే వారిస్థానంలో వున్న ఆ ఖాళీలను ఇప్పటికీ భర్తీచేయలేదన్నారు. దీంతో ఆ విభాగం పని పూర్తిగా స్తంభించి పోయిందన్నారు. భవన నిర్మాణ అనుమతుల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నగరంలో 5వేల మందికి పింఛన్లు ఇవ్వాల్సివుందని, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రజల నుంచి ఎన్నికైన పాలకవర్గాన్ని నిర్లక్ష్యం చేస్తూ, పింఛన్ల మంజూరులో జన్మభూమి కమిటీ ఇన్‌ఛార్జిలకు ప్రాధాన్యత ఇవ్వడం దారుణమన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాసయాదవ్, రవిచంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# 132వ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



నెల్లూరుజిల్లా కాంగ్రెస్‌పార్టీ సేవాదళ్ అధ్యక్షులు దామెర్ల శివప్రసాద్ ఆధ్వర్యంలో ఈనెల 28వతేదీ నెల్లూరు ఇందిరా భవన్‌లో 132వ భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు డా॥ పనబాక కృష్ణయ్య పాల్గొని కాంగ్రెస్ పతాకాన్ని ఆవిష్కరించి వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ బ్రిటీష్ పాలనలో స్వతంత్ర పోరాట సమయంలో డిసెంబర్ 28 1885లో ఆవిర్భవించిందని, స్వతంత్ర్యం వచ్చిన తర్వాత అతిపెద్ద ప్రజాస్వామ్య రాజకీయ పార్టీగా ఆవిర్భవించిందని వివరించారు. భారతదేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నుండి లాల్‌బహుదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, పి.వి.నరసింహారావు, మన్మోహన్ సింగ్ వరకు కూడా కాంగ్రెస్‌పార్టీకే కాకుండా దేశానికి దిశ దశ నిర్దేశించిన ఘనత వారికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సమన్వయ కమిటి సభ్యులు సి.వి.శేషారెడ్డి, కాంగ్రెస్ నాయకులు చేవూరు దేవకుమార్‌రెడ్డి, చెంచలబాబుయాదవ్, గాలాజు శివాచారి, పత్తి సీతారాంబాబు, ఉడతా వెంకట్రావు, ఆసిఫ్ పాషా, శీలం తిరుపయ్య, అనురాధరెడ్డి, బాల సుధాకర్ పాల్గొన్నారు.

# రంగనాథుడి సొత్తు స్వాధీనం

నెల్లూరు ఏసి సెంటర్‌లోని కోట్ల రూపాయల విలువచేసే శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానానికి సంబంధించిన స్థలంలో ఉన్న కట్టడాలను బుధవారం నుంచి తొలగించడం మొదలుపెట్టారు. ఈ స్థలంలో 99ఏళ్ల లీజు క్రింద పలు వ్యాపార సంస్థలు వెలసివున్నాయి. ఇంతకాలం నామమాత్రపు లీజుతో ఈ వ్యాపార సంస్థలు నడుపుతున్నందువల్ల దేవస్థానానికి పెద్దఎత్తున ఆదాయం రాకుండాపోయింది. లీజు గడువు ముగియడంతో బుధవారం దేవాదాయశాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పోలీసుల సహకారంతో ఈ నిర్మాణాలను తొలగించడం మొదలుపెట్టారు.

# చిన్నారులకు వైజేపీ లయన్స్ వస్తువులు





గూడూరు పట్టణం లోని అంబేద్కర్‌నగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం లోని చిన్నారులకు వైజేపీ లయన్స్ క్లబ్ గూడూరు ఆధ్వర్యంలో విద్యా సామాగ్రి, ఆట వస్తువులను మంగళవారం పంపిణీ చేశారు. పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ దివంగత వై.జె.ప్రభాకర్‌రెడ్డి 74వ జయంతి సందర్భంగా ఆర్.వి.రావు దాతృత్వంతో చిన్నారులకు వస్తువులను అందించారు. ఈ కార్యక్రమంలో ఆ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి నాగహరికృష్ణ, సుబ్రహ్మణ్యంరాజు, ఆర్.వి.రావు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిప్రదాయకం..'గురుచరిత్ర'

'గురుచరిత్ర' ఎంతో భక్తిప్రదాయకమైన గ్రంథమని, గురువుల వైశిష్ట్యాన్ని ప్రబోధించే ఈ గ్రంథం పారాయణ గ్రంథంగా ప్రఖ్యాతిపొందిందని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు, సాయిబాబా ప్రవచకుడు జి.భాస్కరశర్మ అన్నారు. నెల్లూరు పురమందిరంలో మంగళవారం రాత్రి జరిగిన 'గురుచరిత్ర' ప్రవచనాల్లో ఆయన మాట్లాడుతూ, మన పవిత్ర భారతదేశంలో అనాదిగా గురు పరంపర వస్తోందని, శ్రీ దత్తాత్రేయుడు, శ్రీపాద వల్లభుడు, శంకరాచార్యులు వంటివారు ఈ గురుపరంపరలో వున్నారని, వారి ప్రవచనాలు భక్తుల్లో ఆధ్యాత్మిక వెలుగులను సంతరింపజేస్తాయన్నారు. శ్రీసాయి భరద్వాజ సత్సంగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీనివాసులు, భాస్కర్ పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని గురుప్రబోధనలు విన్నారు. తొలుత ఈ కార్యక్రమాన్ని పరివ్రాజకాచార్య రాధానంద భారతిస్వామి జ్యోతి వెలిగించి ప్రారంభించారు.






# పాట్లు మారేనా?

(మొదటి పేజీ తరువాయి)

బ్యాంకు ఖాతాలెక్కువ. కాబట్టి నల్లకుబేరుల డబ్బు పేదల ఖాతాలలో బాగా అడ్జస్ట్ అయిపోయింది. స్థిరాస్తుల కొనుగోలు, బంగారం కొనుగోళ్ల ద్వారా మరికొంత నలుపు తెలుపై పోయింది. అన్నింటికి మించి ఆర్బీఐ కొత్తగా జారీ చేసిన 2వేల కోట్లు బ్యాంకులు, ఏటిఎంల ముందు 'క్యూ'లలో నిల్చున్న వారికి మనిషికి ఒకటి, రెండు నోట్ల లెక్కన చేరితే నల్లకుబేరులకు మాత్రం వందల కోట్ల లెక్కన చేరాయి. కొత్త కరెన్సీని కూడా బ్లాక్‌కు పంపించడంలో బ్యాంకులు తమదైన పాత్ర పోషించాయి. కాబట్టి దేశంలో భారీస్థాయి నల్లధనం అన్నదానికే ఆస్కారం లేకుండా పోయింది. నోట్ల మార్పిడిలో నల్లధనం పెద్దగా బయటపడకపోవడం వల్లే దేశ వ్యాప్తంగా కూడా కేంద్రం అక్రమార్జులపై ఐటి దాడులు నిర్వహిస్తోంది. అసలు ఈ దాడులనెప్పుడో మొదలుపెట్టివుంటే పెద్దనోట్ల రద్దు అవసరముండేది కాదు. పెద్దనోట్ల రద్దు మూలంగా కాశ్మీర్‌లో అల్లర్లు ఆగడమొక్కటే సంతోషించాల్సిన విషయం.

పాతనోట్ల రద్దుతో 2016 వెళ్లిపోతుంది. కొత్త నోట్లతో 2017లోకి ప్రవేశిస్తున్నాం. ప్రధాని చెబుతున్న 'అచ్చేదిన్'కు 2017లోనే అంకురార్పణ జరగాలని ప్రజలు ఆశిస్తున్నారు. పెద్దనోట్ల రద్దువల్ల ఆశించిన నల్లధనం రాకపోగా దేశ ఆర్థిక వ్యవస్థకు భారీ నష్టం వాటిల్లింది. ఆఖరుకు 2శాతం జిడిపి రేటును కూడా తగ్గించుకోవాల్సి వచ్చింది. ఈ ఆర్థిక సంక్షోభం నుండి బయటపడాలంటే స్వేచ్ఛాయుత ఆర్థిక సంస్కరణలు తప్పనిసరి! పన్నుల విధానాన్ని సరళం చేయాలి. దేశంలో ముందు అన్ని వ్యాపారాలకు మూలస్థంభాలైన వ్యవసాయం, రియాల్టీ రంగం కోలుకోవాలి. వీటికి చేయూతనిచ్చే విధంగా కేంద్రం తక్షణ చర్యలు చేపట్టాలి.

# లీడర్స్ వార్!

(మొదటి పేజీ తరువాయి)

సర్వేపల్లి నియోజకవర్గంలో అధికారపార్టీ నాయకులు అక్రమ గ్రావెల్ తవ్వకాలకు పాల్పడుతున్నారంటూ కాకాణి చేసిన ఆరోపణలతో వీరి మధ్య చిచ్చుకు బీజం పడింది. ఆ వెంటనే వైకాపా నాయకులకు చెందిన గ్రావెల్ టిప్పర్లను పట్టించి, అక్రమ గ్రావెల్ పని వైకాపా వారిదేనంటూ తెలుగుదేశం వాళ్లు ఎదురుదాడికి దిగారు.

ఆ తర్వాత కాకాణిపై ఒక వర్గం మీడియాలో భూకబ్జాదారుడంటూ వార్తలు వెలువడ్డాయి. నెల్లూరురూరల్ మండలం వావిలేటిపాడు వద్ద ఆయన కొందరి ఫ్లాట్లను ఆక్రమించుకుని తన భూమిలో కలిపేసుకున్నాడంటూ వార్తలు వచ్చాయి. దీనిని ఆధారంగా చేసుకుని తెలుగుదేశం నాయకులు కాకాణిని పెద్ద భూకబ్జాదారుడిగా చిత్రించారు. అయితే ఆ తర్వాత రెవెన్యూ అధికారులు చేసిన సర్వేలో లేఅవుట్ యజమానే రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమికంటే ఎక్కువ భూమిని లేఅవుట్ చేసి కొందరికి ఫ్లాట్లు కట్టబెట్టారని సమాచారం. అలాగే సొంత పొదలకూరు మండలంలోనూ కాకాణిపై కొందరు కాల్‌మనీ కింద కేసులు పెట్టారు. వీటన్నింటి వెనుక సోమిరెడ్డి హస్తముందని భావించిన కాకాణి ఎదురుదాడి అస్త్రాల కోసం వెదికారు. ఆ పరంపరలో ఆయన చేతికి అసలిదో నకిలిదో తెలియదుగాని, ఏ పార్టీ వాళ్లు పరోక్షంగా అందించారో అర్ధం కావడంలేదు గాని సోమిరెడ్డికి సంబంధించిన కొన్ని డాక్యుమెంట్లు ఆయన చేతికి చిక్కాయి. వీటిని చేతిలో పట్టుకునే కాకాణి ఇటీవల సోమిరెడ్డిపై నిప్పులు చెరిగారు. జిల్లాలోనే అత్యంత పేద రాజకీయ నాయకుడినని చెప్పుకుంటున్న సోమిరెడ్డికి విదేశాలలో వెయ్యికోట్ల దాకా ఆస్తులున్నాయి. మలేషియా, సింగపూర్, హాంకాంగ్‌లలో సొంత ఇళ్లున్నాయి. ఈ దేశాలలోని బ్యాంకుల్లో ఆయన పేరుతో పాటు కుటుంబసభ్యుల పేర్లతో 140కోట్ల రూపాయల బ్యాంకు లావాదేవీలు జరిగాయి. మలేషియాలో 20కోట్ల విలువ చేసే 68ఎకరాల భూముంది. రామస్వామి వీరన్ అనే ట్రేడర్ ద్వారా సోమిరెడ్డి తన బ్లాక్‌మనీని హవాలా రూపంలో విదేశాలకు పంపించాడు. ఈ ఆస్తులన్నీ ఎలా సంపాదించావ్, ప్రభుత్వానికి ఒక్క రూపాయి పన్ను కట్టకుండా విదేశాలకు పంపించావ్, సోమిరెడ్డిపై సిబిఐ విచారణ జరిపితే అన్ని విషయాలు బయటపడుతాయంటూ కాకాణి డిమాండ్ చేశారు. అంతేకాదు, సోమిరెడ్డి ఐఎస్‌డి కాల్‌లిస్టును, బ్యాంకు ఖాతాల లావాదేవీల లిస్టును కూడా ఆయన విలేకరులకు చూపెట్టాడు.

కాగా, కాకాణి ఆరోపణలను సోమిరెడ్డి తీవ్రంగా ఖండించారు. కాకాణి చూపేవన్నీ నకిలీ డాక్యుమెంట్లని, కాకాణికి నకిలీలను సృష్టించడం అలవాటేనని ఆయన మండిపడుతున్నారు. నీ ఆరోపణలను ఋజువు చేసే దమ్ముంటే తనపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సవాల్ విసిరాడు.

మొత్తానికి ఈ కేసు పోలీసు విచారణకు పోతేగాని నిజాలు బయటకు వచ్చేటట్లులేవు. కాకాణి చూపేది నకిలీ డాక్యుమెంట్లా లేక ఆయన చెబుతున్నట్లు సోమిరెడ్డికి విదేశాలలో వందలకోట్లు ఆస్తులున్నాయా అన్నది నిరూపణ కావాలంటే లోతైన విచారణ జరగాల్సిందే! కాకాణి మీద సోమిరెడ్డి బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మొత్తానికి ఈ ఇద్దరు నాయకులు పరస్పర ఆరోపణలతో చలికాలంలోనూ సెగలు పుట్టిస్తున్నారు. 1994 నుండికూడా సర్వేపల్లి కేంద్రంగానే రాజకీయ యుద్ధం వాడివేడిగా జరుగుతుండడం గమనార్హం. ఆరోజు నుండి కూడా తెలుగుదేశం వైపు నుండి సోమిరెడ్డే... అతనికి ప్రత్యర్థులే మారుతూ వచ్చారు. మొదట సి.వి.శేషారెడ్డి, ఆ తర్వాత ఆదాల ప్రభాకర్‌రెడ్డి... ఇప్పుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి. ప్రత్యర్థులు మారుతూ వచ్చారుగాని సోమిరెడ్డికి వారితో యుద్ధం చేయడం కామన్‌గానే వుంది.

# పోటీలో ఎవరు?

(మొదటి పేజీ తరువాయి)

వీటికంటే కూడా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక రంజుగా ఉండబోతుంది. ఎందుకంటే ఇది అధికార తెలుగుదేశం, ప్రతిపక్ష వైకాపాల మధ్య ప్రత్యక్ష యుద్ధం. సాధారణంగా ఈ తరహా ఎన్నికల్లో అధికారపార్టీదే పైచేయిగా ఉంటుంది. అధికారం చేతిలో ఉంటుంది కాబట్టి ప్రతిపక్ష స్థానిక ఓటర్లను సైతం ప్రలోభపెట్టి తమవైపుకు తిప్పుకోగలరు. గతేడాది జరిగిన ప్రకాశంజిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికే దీనికి ఉదాహరణ. ఆ జిల్లాలో వైకాపాకు మెజార్టీ ఓట్లు ఉన్నప్పటికీ అధికార బలాన్ని ఉపయోగించి తెలుగుదేశం గెలవడం తెలిసిందే!

రేపు నెల్లూరు జిల్లాలో కూడా అదే జరగవచ్చు. మొదట్లో ఈ జిల్లాలో వైకాపాకే స్థానిక సంస్థల ఓటర్లు ఎక్కువుగా వున్నారు. తర్వాత కాలంలో కొందరు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు వైకాపా నుండి తెలుగుదేశంలో చేరడంతో పార్టీ బలాబలాలు తారుమారయ్యాయి.

అయినా కూడా నెల్లూరుజిల్లా స్థానిక సంస్థ ఎమ్మెల్సీకి పోటీ చేస్తామని వైకాపా నాయకులు ప్రకటించారు. మొన్న నెల్లూరుకు వచ్చిన ఒంగోలు ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి ఈ విషయాన్ని స్పష్టం చేశారు. అభ్యర్థిని త్వరలోనే ప్రకటిస్తామన్నారు. అయితే ప్రతిపక్షం తరఫున అంత ధైర్యంగా పోటీ చేసే అభ్యర్థి ఎవరా? అన్నది ప్రశ్న! కావలి మాజీఎమ్మెల్యే వంటేరు వేణుగోపాలరెడ్డి పేరు ప్రచారంలో ఉంది. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆయన పేరు ప్రతిపాదించాడని తెలుస్తోంది. ఇప్పుడు ఎమ్మెల్సీ పోటీలోకి దిగితే కనీసం 10 నుండి 15కోట్లన్నా ఖర్చుపెట్టాలి. గెలుపు గ్యారంటీ లేని సీటు కోసం ఆయన ఇంత సాహసం చేయగలడా? ప్రస్తుతం వైకాపాలో వున్న నాయకుల్లో అంత ఆర్థిక భారాన్ని భరించేవాళ్లు లేరు. ఒకవేళ వంటేరు కాకుంటే వైకాపా నుండి నామమాత్రంగానైనా ఇంకో నాయకుడిని బరిలోకి దించవచ్చు. ఇక్కడ నుండి పోటీ చేయాలన్నది జగన్ పంతం!

వైకాపా అభ్యర్థి బరిలోకి దిగితే తెలుగుదేశం అభ్యర్థికి తడిసి మోపెడవడం ఖాయం. అధికారపార్టీ అభ్యర్థి అయినప్పటికీ ఖర్చు నుండి తప్పించుకోలేడు. అయితే ఖర్చుపెట్టడానికి సిద్ధంగా వున్న నాయకులు టీడీపీలో ఉండడం గమనార్హం. పార్టీ అధిష్టానం ఆదేశిస్తే మాజీమంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డిలతో పాటు డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, తెలుగుదేశం నాయకులు పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి, మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డిలతో పాటు ప్రస్తుత ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి కూడా రెడీగా వున్నారు. మరి చంద్రబాబు ఎవరిని ఆదరిస్తాడో చూడాలి!

# నెల్లూరి సీమ!

శ్రీ రంగనాయకుల్ సేదదీరంగ తా
  శ్రీరంగమయిన నెల్లూరి సీమ!
మనుమసిద్ధీశ తిక్కన మంత్రి బంధమ్ము
  భారతమ్ముయిన నెల్లూరి సీమ!
స్వాతంత్ర్య సమరాంక శౌర్యశంఖ శుభంక
  రారావమయిన నెల్లూరి సీమ!
రాజకీయ సినీ కళా జగన్నక్షత్ర
  తోరణమ్ముయిన నెల్లూరి సీమ!

పెన్న నది నెయ్యమున సన్న బియ్యమునకు
పేరు పొందినది-ఇది-నెల్లూరి సీమ!
జాణలకు జాణ! నెరజాణ రాణ మిగుల
సింహపురి ధామ! నెల్లూరి సీమ లేమ!

### హరిహరాద్వైతం

నారాయణ కోటీశ్వర
పారాయణ ఫలమెసంగు వరశిష్య గురు
స్ఫార స్థిర స్నేహ సమా
హార పురస్కృతుల హరిహరాద్వైతముగన్!

### ఈశ్వర ప్రసాదం

వర కవితా కోటీశ్వర
గురుపాదుల స్మృతులు కృతులు కొల్చుచు రాజే
శ్వర సుకృతి మిత్ర సుకృతుల
పురస్కృతుల జేయు సింహపురి పేరొలయన్!

### నాగభైరవ కీర్తి స్ఫూర్తి

యువ సంతకాల మెరుపుల
నవ కవికుల గురువతండు! నా పయి పరపెన్
దివి నుంచి నాగభైరవ
సవినయముగ దాల్తు సుప్రసాద 'స్ఫూర్తి'న్!

(ఈ నెల 18న నెల్లూరులో 'డా. నాగభైరవ స్ఫూర్తి అవార్డు' స్వీకరణ సందర్భంగా)



డా. కాసల నాగభూషణం
చెన్నై. 094444 52344




జననం : 7.8.1959 మరణం : 20.12.2016



## శ్రద్ధాంజలి

మా ఇంటి దైవం, మా తల్లిగారైన
**శ్రీమతి జమిలి రాజ్యలక్ష్మి గారు**
తేది. 20.12.2016 మంగళవారం స్వర్గస్తురాలైనారు.
*వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...*

భర్త : **జమిలి జ్వాలాంజనేయులు**
కుమారులు - కోడళ్ళు
**సత్యనారాయణ - వెంకట అనూష**
**శివకృష్ణ - లక్ష్మీప్రసన్న**
**సుందర గణేష్**
కుమార్తె - అల్లుడు
**వేమా జ్యోతి - శేషగిరి రావు**
మనుమళ్ళు, మనుమరాలు
**యశ్వంత్, దేదీప్య, హితేష్**

ఉత్తరక్రియలు : తేది. 30.12.2016 శుక్రవారం నెల్లూరు, పప్పులవీధిలోని శ్రీ వేద సంస్కృత పాఠశాల శుభస్వీకరణ సత్రం-2 నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

# ఎవడైతే నాకేంటి?



- ఏకులావచ్చి మేకులా మారిన మేయర్
- తీసుకొచ్చిన మంత్రికే మింగుడుపడలేదు
- నేను జీరో కాదు... హీరో అంటున్న అజీజ్

*ఐయామ్ నాట్ జీరో... ఐయామ్ అజీజ్... నేనుంటేనే పార్టీ ఉంటుంది... పార్టీ కోసం నేను కాదు... నెల్లూరునగర మేయర్ అజీజ్ మంత్రి నారాయణ ముందే అన్నమాటలివి. ఇంతకాలం జిల్లాలో మంత్రి మాటకు ఎదురు చెప్పేవారు లేరనుకున్నారు. అయితే, అజీజ్ రూపంలో మంత్రికే ఎదురుతిరిగే మొనగాడొచ్చాడు. నారాయణకు ఇది మింగుడుపడడం లేదు.*

ఇటీవల నారాయణ మెడికల్ కాలేజీ ప్రాంగణంలోని తన నివాసంలో మంత్రి నారాయణ నెల్లూరు కార్పొరేషన్‌లో జరుగుతున్న పనులపై సమీక్ష నిర్వహించారు. ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కొండ్రెడ్డి రంగారెడ్డి, డాక్టర్ జడ్.శివప్రసాద్‌లతో పాటు మరికొందరు కార్పొరేటర్లు, అధికారులు హాజరయ్యారు. ఉదయం 9గంటలకు సమావేశమంటే, అజీజ్ రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి పెట్టుకున్నాడు. మంత్రి పి.ఏ ఎన్నిసార్లు ఫోన్ చేసినా మేయర్ ఫోన్ స్విచ్ఛాఫే! ఈలోపు నగర, రూరల్ ఇన్‌ఛార్జ్‌లు, పలువురు కార్పొరేటర్లు అజీజ్ వ్యవహారశైలిపై మంత్రికి ఫిర్యాదు చేసారు. కార్పొరేషన్‌లో అతని ఇష్టారాజ్యమైందని, అన్ని ప్రాంతాల వారికి పనులు ఇవ్వడం లేదని, కార్పొరేషన్ తన ఒక్కడి సొత్తు అన్నట్లు వ్యవహరిస్తున్నాడని ఆరోపణలు చేసారు. అంతలో 11గంటలకు అజీజ్ వచ్చాడు. అజీజ్‌ను చూడడంతోనే మంత్రికి కాలింది. మీ పనులు పార్టీకి మైలేజీ తీసుకురావాలి, మనం ఒక పని చేసామంటే దానిని ప్రభుత్వానికి, పార్టీకి అన్వయించాలి. నేను వంద కోట్లు దాకా పనులు మంజూరు చేశాను. ఇక సాధారణ పనులున్నాయి. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులున్నాయి. 20శాతం పనులు మేయర్ క్రింద పెట్టుకుని మిగతా పనులను డివిజన్‌ల వారీగా పంచాలి. కాని నెల్లూరులో అది జరగడం లేదు. ఇక్కడ పార్టీ ముఖ్యం. యువర్ నాట్ హీరో... యువర్ జీరో... అని మంత్రి కోప్పడ్డారు. దీనికి... ఐయామ్ నాట్ జీరో... ఐయామ్ అజీజ్... అంటూ అజీజ్ కూడా తీవ్రంగానే స్పందించాడని తెలుస్తోంది. నేనుంటేనే పార్టీ... నేను మోస్తేనే పార్టీ! మీరు మంత్రి కావచ్చు, కాని నెల్లూరు కార్పొరేషన్‌కు నేనే హీరో అన్నట్లు మాట్లాడేసరికి మంత్రి కూడా ఖిన్నుడైపోయాడు.

మేయర్ అజీజ్ వైఖరి మొదటి నుండి కూడా తెలుగుదేశంలో ఎవడైతే నాకేంటి అన్నట్లుగానే వుంది. పార్టీలో ఆయన ఎవర్నీ లెక్క చేయడం లేదు. సోమిరెడ్డి అంటే లెక్కలేదు, ఆనం వాళ్లతో ఎప్పుడూ పేచీనే, ఆదాలకూ సలాం చేయడు, నారాయణకు గులాం అని లొంగలేదు.

చంద్రబాబుతో ఉన్న సాన్నిహిత్యం వల్ల నారాయణపై ఎదురుదాడికి దిగే సాహసాన్ని జిల్లాలో కొమ్ములు తిరిగిన తెలుగుదేశం నాయకులు కూడా చేయలేకపోతున్నారు. మంత్రి మీద ఎంత అసంతృప్తి ఉన్నా, ఎవ్వరూ బయటపడడం లేదు. అజీజ్ అలా కాదు. ముక్కుసూటి మనిషి. ఎవ్వరికీ తలొంచే రకం కాదు. నెల్లూరు నగర పాలకసంస్థను తన సామ్రాజ్యం అనుకుంటున్నాడు. ఈ సామ్రాజ్యంలో మంత్రి నారాయణ కాదు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వేలు పెట్టినా అతను సహించేటట్లు లేదు.










## 6వ వర్ధంతి

పూజ్యులు, మా ఇంటి దైవం
మా పురోభివృద్ధికి ముఖ్యకారకులు, "మిత్రబంధు"

**శ్రీ నారపరెడ్డి కోదండరామరెడ్డి, M.A. గారు**

(మైపాడు వాస్తవ్యులు)

స్వర్గస్తులై తేది 05-01-2017 నాటికి
ఆరు సంవత్సరాలు నిండనున్న సందర్భంగా

ఆయన దివ్యస్మృతిని స్మరించుకుంటూ
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

**శ్రీమతి నారపరెడ్డి సులోచనమ్మ** - భార్య

కుమారులు - కోడళ్ళు
**డాక్టర్. ఎన్.విష్ణుస్వరూప్‌రెడ్డి** - **డాక్టర్. శాంతి**
ఇ.ఎన్.టి & ఫేషియల్ ప్లాస్టిక్ సర్జన్, కేర్ హాస్పిటల్, బంజారాహిల్స్, హైదరాబాద్. - ఒబేస్ట్రిషియన్ & గైనకాలజిస్ట్ అపోలో హాస్పిటల్, జూబ్లీహిల్స్, హైదరాబాద్.
**ఎన్.వినోద్‌రెడ్డి** - **శాలిని**
ఛైర్మెన్ & ఎం.డి., సిఆర్ఎంఐటి గ్రూప్, బెంగుళూరు. - డైరెక్టర్, సిఆర్ఎంఐటి గ్రూప్, బెంగుళూరు.

కుమార్తెలు - అల్లుళ్ళు
**జి.సుప్రియ** - **జి.విజయసింహారెడ్డి**, డైరెక్టర్, ఫార్ట్యూన్ ఇండియా బిల్డర్స్, బెంగుళూరు.
**ఎన్.పద్మప్రియ** - **ఎన్.చంద్రారెడ్డి**, ఛైర్మెన్ & ఎం.డి., ఫార్ట్యూన్ ఇండియా బిల్డర్స్, బెంగుళూరు.

మనుమలు, మనుమరాండ్రు
**జి.అభిషేక్‌రెడ్డి**, సిఆర్ఎంఐటి (డైరెక్టర్, ఆస్ట్రేలియా), **వైష్ణవి**
**జి.అనుదీప్, రాహిల్, రుషిల్ సాకేత్, విషాల్, మేఘున, హర్ష, సంజన, వినూష**
మునిమనుమరాలు - **అమైర**


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com